సాక్షి
అనంతపురం
బుధవారం । 14 । ఫిబ్రవరి । 2024



చీనీ టన్ను రూ.18 వేలు

అనంతపురం వ్యవసాయ మార్కెట్ యార్డులో మంగళవారం చీనీకాయలు టన్ను గరిష్ట ధర రూ.18 వేలు పలికాయి.



టమాట కిలో రూ.15

కక్కలపల్లి మండీలో మంగళవారం కిలో టమాట గరిష్ట ధర రూ.15 పలికింది. కనిష్టం రూ.6, సరాసరి రూ.10 ప్రకారం క్రయ విక్రయాలు జరిగాయి.

గరిష్టం/కనిష్టం
35.9°/14.5°

జిల్లాలో మంగళవారం ఉష్ణగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. గాలివేగం స్వల్పంగా పెరిగింది. ఆగ్నేయం దిశగా గాలులు గంటకు 6 నుంచి 10 కిలోమీటర్ల వేగంతో వీచాయి.

న్యూస్‌రీల్

స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద కట్టుదిట్టమైన ఏర్పాట్లు



అధికారులకు సూచనలిస్తున్న జేసీ

ఉరవకొండ: ఈవీఎంల కోసం స్ట్రాంగ్‌రూమ్, డిస్ట్రిబ్యూషన్ సెంటర్ల వద్ద కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేపట్టాలని జాయింట్ కలెక్టర్ కేతన్ గార్గ్ ఆదేశించారు. పట్టణంలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేయనున్న స్ట్రాంగ్‌రూమ్, డిస్ట్రిబ్యూషన్ సెంటర్లను మంగళవారం ఆయన పరిశీలించారు.అనంతరం తహసీల్దార్ కార్యాలయంలో అధికారులతో సమీక్ష నిర్వహించారు. పోలింగ్ కేంద్రాల వద్ద మౌలిక వసతులు ఏర్పాటు చేయాలన్నారు. అధికారులు ఎక్కడా నిర్లక్ష్యం చేయరాదన్నారు. నోడల్ అధికారులు తమకు కేటాయించిన విధులను సక్రమంగా నిర్వర్తించాలన్నారు. కార్యక్రమంలో ఈఆర్ఓ శిరిష, గుంతకల్లు డీఎస్పీ శివభాస్కర్‌రెడ్డి, తహసీల్దార్ శ్రీనివాస్‌లు పాల్గొన్నారు.

ఇంటర్ ప్రవేశానికి దరఖాస్తు చేసుకోండి

అనంతపురం రూరల్: శ్రీ సత్యసాయి జిల్లా తనకల్లు బాలికల గిరిజన సంక్షేమశాఖ గురుకుల కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరంలో ప్రవేశానికి విద్యార్థినులు దరఖాస్తు చేసుకోవాలని ఉమ్మడి జిల్లా గిరిజన సంక్షేమశాఖ అధికారి రామాంజినేయులు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. మార్చి 25లోపు www.aptwgurukulam.ap.gov.in వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుందన్నారు. ఎంపీసీ 40, బైపీసీ 40 సీట్లు భర్తీ చేస్తామన్నారు. ఏప్రిల్ 7న ప్రవేశ పరీక్ష ఉంటుందన్నారు. వివరాలకు 8309005097 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

దొంగకు 7 నెలల జైలు



అనంతపురం: ఇంట్లో దొంగతనానికి పాల్పడిన ఓ వ్యక్తికి 7 నెలల జైలు శిక్ష పడింది. ఈ మేరకు అనంతపురం జేఎఫ్‌సీఎం స్పెషల్ మొబైల్ కోర్టు మేజిస్ట్రేట్ జె.సుజిన్ కుమార్ మంగళవారం తీర్పు వెలువరించారు. అనంతపురం 2వ రోడ్డులోని ఓ ఇంట్లో గత ఏడాది అక్టోబర్‌లో గుజరాత్ కు చెందిన విక్కీ దొంగతనానికి పాల్పడ్డాడు. నిందితుడిని అరెస్టు చేసిన త్రీటౌన్ సీఐ ధరణీకిశోర్ కోర్టులో చార్జ్‌షీట్ దాఖలు చేశారు. విచారించిన మేజిస్ట్రేట్.. విక్కీకి 7 నెలల జైలు శిక్ష విధిస్తూ తీర్పు వెలువరించారు. సీఐ ధరణీ కిశోర్, ఏపీపీ హేమలత, కోర్టు హెడ్ కానిస్టేబుల్ సాలప్పను ఈ సందర్భంగా ఎస్పీ అన్బురాజన్ అభినందించారు.

పలు కోర్సులపై ఉచిత శిక్షణ

అనంతపురం క్రైం: జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ, సీడాప్ ఆధ్వర్యంలో రిటైల్ సేల్స్ సూపర్‌వైజర్, కంప్యూటర్, స్పోకెన్ ఇంగ్లిష్ కోర్సుల్లో ఉచిత శిక్షణ ఇస్తున్నట్లు పీడీ నరసింహారెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటర్ పాసైన గ్రామీణ ప్రాంత అభ్యర్థులే అర్హులన్నారు. అనంతపురం నగర శివారు వై జంక్షన్ సమీపంలోని టీటీడీసీ కార్యాలయంలో ఈ నెల 14 నుంచి 18 వరకూ జరిగే ఎంపిక ప్రక్రియకు ఒరిజినల్ సర్టిఫికెట్లతో హాజరు కావాలన్నారు. వివరాలకు 8639439804, 8074452233, 7730930919లలో సంప్రదించాలన్నారు.

అధినేత రాకకు ఆత్రుతగా

- 18న రాప్తాడులో 'సిద్ధం' సభ
- పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేయనున్న సీఎం జగన్
- ఏర్పాట్లు పరిశీలించిన మంత్రి పెద్దిరెడ్డి



సభా వేదికను పరిశీలిస్తున్న జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, సీఎం ప్రోగ్రామ్స్ కో–ఆర్డినేటర్ తలశిల రఘురాం, ఎమ్మెల్యేలు తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి, శంకరనారాయణ, పెద్దారెడ్డి, వెంకట్రామిరెడ్డి, మాజీ ఎమ్మెల్యే విశ్వ, జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ తదితరులు

రాప్తాడు: ప్రజా సంక్షేమాన్ని పరుగులు పెట్టించిన సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఎన్నికల కదనరంగంలోనూ అంతే వేగంగా దూసుకుపోతున్నారు. ప్రతిపక్షాలను బెంబేలెత్తిస్తూ ఇప్పటికే సమరభేరి మోగించారు. రాష్ట్రంలో రెండు చోట్ల 'సిద్ధం' సభలు నిర్వహించి ప్రతిపక్షాల గుండెల్లో రైళ్లు పరుగెత్తించారు. ఈ క్రమంలోనే రాయలసీమ వ్యాప్తంగా ఉన్న పార్టీ శ్రేణులను ఎన్నికలకు సమాయత్తం చేసేందుకు ఈనెల 18న రాప్తాడు రానున్నారు. ఆటోనగర్ వద్ద నిర్వహించే 'సిద్ధం' సభలో ఆయన ప్రసంగించనున్నారు.

వడివడిగా 'సిద్ధం'

సభకు తరలివచ్చి సంక్షేమ సారథికి జేజేలు పలికేందుకు ఒక వైపు పార్టీ శ్రేణులే కాకుండా ప్రజలు వేయి కళ్లతో ఎదురుచూస్తుండగా.. మరోవైపు వారికి ఎలాంటి ఇబ్బంది తలెత్తకుండా ఏర్పాట్లు చేయడంలో పార్టీ పెద్దలు తలమునకలవుతున్నారు. సభకు లక్షల సంఖ్యలో పార్టీ శ్రేణులు హాజరవుతారని అంచనా ఉన్న నేపథ్యంలో ఆ మేరకు ఏర్పాట్లు చేస్తున్నారు. సభ నిర్వహణకు కేటాయించిన 110 ఎకరాలను చక్కగా చదును చేస్తున్నారు. సీఎం హెలీప్యాడ్ నిర్మాణ పనులు తుదిదశకు చేరుకున్నాయి. ఇప్పటి వరకూ 25కి పైగా పార్కింగ్ ప్రాంతాలు గుర్తించారు. సభకు హాజరయ్యే కార్యకర్తలకు దగ్గరగా వెళ్లి సీఎం వైఎస్ జగన్ అభివాదం చేయడానికి వీలుగా కిలోమీటరు విస్తీర్ణంతో ర్యాంప్‌లు ఏర్పాటు చేస్తున్నారు. తలశిల రఘురాం సభా ప్రాంగణం వద్దే ఉంటూ పనులను పర్యవేక్షిస్తున్నారు.

పరిశీలించిన మంత్రి పెద్దిరెడ్డి

'సిద్ధం' బహిరంగ సభ ఏర్పాట్లను మంగళవారం జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, సీఎం ప్రోగ్రామ్స్ కో–ఆర్డినేటర్, ఎమ్మెల్సీ తలశిల రఘురాంతో కలిసి పరిశీలించారు. వాహనాల రాకపోకలు, వాహనాల పార్కింగ్, భద్రతా ఏర్పాట్లు, సీఎం సభాస్థలి, హెలీప్యాడ్, ట్రాఫిక్, ఇతర అంశాలపై సమీక్షించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యేలు తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి, అనంత వెంకట్రామిరెడ్డి, కేతిరెడ్డి పెద్దారెడ్డి, వై.వెంకట్రామిరెడ్డి, మాలగుండ్ల శంకర నారాయణ, ప్రభుత్వ సలహాదారు(విద్య) ఆలూరు సాంబశివారెడ్డి, పార్టీ జిల్లా అధ్యక్షుడు పైలా నరసింహయ్య, ఉరవకొండ, మడకశిర పార్టీ సమన్వయకర్తలు విశ్వేశ్వర రెడ్డి, ఈర లక్కప్ప, జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, రజక కార్పొరేషన్ చైర్మన్ మీసాల రంగన్న, యాదవ కార్పొరేషన్ చైర్మన్ హరీష్ కుమార్ యాదవ్, ఆర్టీసీ జోనల్ చైర్‌పర్సన్ మాల్యవంతం మంజుల తదితరులు పాల్గొన్నారు.

విజయవంతానికి సమష్టిగా కృషి చేద్దాం

- ఎమ్మెల్యేలకు మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి దిశానిర్దేశం

అనంతపురం టవర్‌క్లాక్: సమష్టిగా ముందుకు సాగి సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి 'సిద్ధం' సభను విజయవంతం చేద్దామని జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి పిలుపునిచ్చారు. మంగళవారం స్థానిక ఆర్ అండ్‌బీ అతిథి గృహంలో ఎమ్మెల్యేలతో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ నెల 18న నిర్వహించే 'సిద్ధం' సభ ఏర్పాట్లు, జన సమీకరణ అంశాలపై దిశానిర్దేశం చేశారు. తరలివచ్చే పార్టీ శ్రేణులకు ఎక్కడా చిన్న ఇబ్బంది కూడా తలెత్తకుండా చూద్దామని సూచించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యేలు అనంత వెంకట్రామిరెడ్డి, తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి, కేతిరెడ్డి పెద్దారెడ్డి, వై.వెంకట్రామిరెడ్డి, సిద్దారెడ్డి, శ్రీధర్ రెడ్డి, శంకరనారాయణ, మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వర రెడ్డి, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షులు పైలా నరసింహయ్య, జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, రజక కార్పొరేషన్ చైర్మన్ మీసాల రంగన్న, పార్టీ హిందూపురం పార్లమెంటు సమన్వయకర్త శాంతమ్మ, శింగనమల పార్టీ సమన్వయకర్త వీరాంజనేయులు, వైఎస్సార్ సీపీ నాయకులు వెన్నపూస రవీంద్రరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ముస్తాబైన సభా ప్రాంగణం, హాజరైన వారికి అభివాదం చేస్తూ సీఎం జగన్ నడిచేందుకు వీలుగా ఏర్పాటు చేసిన ర్యాంప్, పార్టీ శ్రేణులకు సౌకర్యవంతంగా భూమిని చదును చేసి మ్యాట్‌తో కప్పిన దృశ్యం

సేవాలాల్ మహారాజ్ జయంత్యుత్సవాలు ప్రారంభం



పూజలందుకున్న సేవాలాల్ మహారాజ్



ప్రత్యేక అలంకరణలో మాతా జగదాంబ

గుత్తి రూరల్: మండలంలోని సేవాగఢ్‌లో సంత్ సేవాలాల్ మహారాజ్ 285వ జయంత్యుత్సవాలు మంగళవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. మాతా జగదాంబ ఆలయంలో హోమాలు, ప్రత్యేక పూజలు చేసి 3 రోజుల పాటు జరిగే ఉత్సవాలకు అంకురార్పణ చేశారు. ఆలయ ప్రధాన అర్చకుడు మారుతీ ప్రసాద్ ఆధ్వర్యంలో అమ్మవారికి సుప్రభాత సేవ, పంచామృతాభిషేకం, మహాగణపతి పూజ, అభిషేకం చేపట్టారు. జయంత్యుత్సవాలను పురస్కరించుకుని సేవాలాల్ మహారాజ్ మాలధారుల ఇరుముడుల కార్యక్రమాన్ని అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.

ఏర్పాట్లు పూర్తి

ఉత్సవాలను పురస్కరించుకుని తరలివచ్చే భక్తులకు ఇబ్బందులు కలగకుండా నిర్వాహకులు ఏర్పాట్లు చేస్తున్నారు. సేవాలాల్ ఆలయ ముఖ ద్వారం వద్ద పెద్ద ఎత్తున బారికేడ్లు ఏర్పాటు చేశారు. భక్తుల సౌకర్యార్థం నారాయణ చారిటబుల్ ట్రస్టు అధ్యక్షుడు నారాయణ నాయక్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. మంగళవారం సుమారు 150 మందికి పైగా రోగులకు పరీక్షలు చేసి మందులను అందజేశారు.

విజయవంతం చేయండి

భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి జయంత్యుత్సవాలను విజయవంతం చేయాలని ట్రస్టు అధ్యక్షుడు కొర్రా జగన్నాథరావు, ఉపాధ్యక్షుడు కేశవ నాయక్, కార్యదర్శి అశ్వత్థనాయక్ పిలుపునిచ్చారు. మంగళవారం ఆలయ ఆవరణలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. భక్తుల కోసం అన్ని సౌకర్యాలు ఏర్పాటు చేశామన్నారు. ఫొటో ఎగ్జిబిషన్, మరుగుదొడ్ల వసతి, వాహనాల పార్కింగ్‌కు స్థలం కేటాయించామన్నారు. ఉత్సవాల్లో అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా బందోబస్తు ఏర్పాటు చేసినట్లు సీఐ వెంకటరామిరెడ్డి తెలిపారు.

అక్రమాలకు 'చెక్'

- ఎన్నికల నేపథ్యంలో పోలీసుల అప్రమత్తం
- జిల్లాలో 24 సాధారణ, 6 డైనమిక్ చెక్‌పోస్టుల ఏర్పాటు
- ముమ్మరంగా తనిఖీలు
- 3 నెలల్లోనే రూ.3.68 కోట్ల నగదు స్వాధీనం

సార్వత్రిక ఎన్నికల నోటిఫికేషన్ త్వరలో రానున్న నేపథ్యంలో జిల్లా పోలీసులు అప్రమత్తమయ్యారు. కర్ణాటక నుంచి అక్రమంగా నగదు, మద్యం రవాణాను అరికట్టేందుకు అనంతపురం రేంజ్ డీఐజీ అమ్మిరెడ్డి, ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్ ప్రత్యేక చర్యలు తీసుకున్నారు. జిల్లా సరిహద్దుల్లో చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి విస్తృతంగా సోదాలు నిర్వహిస్తున్నారు. పోలీసులను టీమ్‌లుగా విభజించి ఇప్పటికే శిక్షణ ఇచ్చారు.

అనంతపురం: ఎన్నికల్లో అక్రమాలను అరికట్టేందుకు పోలీసులు వ్యూహాత్మకంగా అడుగులు వేస్తున్నారు. కర్ణాటక రాష్ట్రంతో సరిహద్దు పంచుకుంటున్న హావళిగి, డొనేకల్లు, విడపనకల్లు, బొల్లనగుడ్డం, బొమ్మనహాళ్, హులికల్లు, కాదలూరు, సోమలాపురం, ఓబుళాపురం, కేపీ కుంట, పైతోట గాలి మారెమ్మ, ఎరడికెర, బీటీపీ రోడ్డు, కంబదూరు, ఓబగానిపల్లి, బెస్తరపల్లి, సేగాలపల్లి, మంజునాథ గార్డెన్స్, డీసెంట్ దాబా, అయ్యగార్లపల్లిలో చెక్‌పోస్టులు ఏర్పాటు చేశారు. నిరంతర సోదాలు కొనసాగిస్తున్నారు. ఒక్కో చెక్‌పోస్టులో ముగ్గురు ఎస్ఐలు, ఆరుగురు హెడ్‌కానిస్టేబుళ్లు, 18 మంది కానిస్టేబుళ్లు మూడు షిఫ్టుల్లో పనిచేస్తున్నారు. మూడు నెలల్లోనే కర్ణాటక నుంచి అక్రమంగా తరలిస్తున్న రూ. 3.68 కోట్ల మొత్తాన్ని స్వాధీనం చేసుకున్నారు.

ఇతర శాఖలతోనూ సమన్వయం

అక్రమాల కట్టడికి ఇతర ప్రభుత్వ శాఖల అధికారులతోనూ పోలీసులు సమన్వయం చేసుకుంటున్నారు. రవాణా, ఎక్సైజ్‌తో పాటు టాస్క్‌ఫోర్స్, లా అండ్ ఆర్డర్, ఎస్ఈబీ, ఏఆర్, దిశ, సైబర్, స్పెషల్ బ్రాంచ్, హోంగార్డు తదితర విభాగాలను ఉన్నతాధికారులు ఏకతాటిపైకి తీసుకొచ్చారు. ఇన్‌కమ్ ట్యాక్స్, సెంట్రల్ గూడ్స్ అండ్ సర్వీస్ ట్యాక్స్, కమర్షియల్ ట్యాక్స్ తదితర శాఖల అధికారులను సమన్వయం చేసుకుంటున్నారు. ఎన్నికల నిర్బంధ నిర్వహణ వ్యవస్థ (ఎలెక్షన్ సీజర్ మేనేజ్‌మెంట్ సిస్టమ్)తో పాటు సెక్షన్ 123 యాక్ట్, 171 బీ, 171 సీ యాక్ట్‌లను పకడ్బందీగా అమలు చేస్తున్నారు.

అసాంఘిక శక్తులపై కన్ను..

జిల్లాలో అత్యంత సమస్యాత్మక ప్రాంతాలపై పోలీసులు ప్రత్యేక దృష్టి సారించారు. పలు నేరాలకు పాల్పడి జైలు జీవితం అనుభవించినా మార్పు తెచ్చుకోని అసాంఘిక శక్తులపై నిఘా ఉంచారు. అల్లర్లకు పాల్పడే వారు, గంజాయి, మాదక ద్రవ్యాలను రవాణా చేసే వ్యక్తుల వివరాలు సేకరించారు. బ్యాంకుల్లో ఎక్కువ డిపాజిట్లు, క్యాష్ బ్యాలెన్స్, జ్యువెలరీ షాపులపైనా నిఘా ఉంచారు.



స్వాధీనం చేసుకున్న మద్యంతో పోలీసులు (ఫైల్)

ప్రశాంత ఎన్నికలే ధ్యేయం

సార్వత్రిక ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించడమే ప్రధాన ధ్యేయంగా ముందుకెళ్తున్నాం. నగదు, మద్యం, ఇతర మాదక ద్రవ్యాలు జిల్లాలోకి ప్రవేశించకుండా చర్యలు తీసుకుంటున్నాం. అన్ని ప్రభుత్వ శాఖల అధికారులను సమన్వయం చేసుకుని నిఘాను పటిష్టం చేశాం. అంతర్రాష్ట్ర సరిహద్దుల్లో 24 చెక్‌పోస్టులు, 6 డైనమిక్ చెక్ పోస్టులను ఏర్పాటు చేశాం.

– కేకేఎన్ అన్బురాజన్, జిల్లా ఎస్పీ

బాధ్యత మరవొద్దు.. ఒత్తిళ్లకు లొంగొద్దు



మాట్లాడుతున్న కలెక్టర్ గౌతమి, హాజరైన నోడల్ అధికారులు, డీఎల్ఎంటీలు, ఏసీఎల్ఎంటీలు

అనంతపురం అర్బన్: ఒత్తిళ్లకు తలొగ్గకుండా ఎన్నికల విధులను బాధ్యతగా నిర్వర్తించాలని కలెక్టర్ ఎం.గౌతమి సంబంధిత అధికారులను ఆదేశించారు. సార్వత్రిక ఎన్నికల దృష్ట్యా మంగళవారం కలెక్టరేట్‌లోని రెవెన్యూభవన్‌లో ఎన్నికల నోడల్ అధికారులు, జిల్లాస్థాయి మాస్టర్ ట్రైనీలు (డీఎల్ఎంటీ), అసెంబ్లీ నియోజకవర్గ స్థాయి మాస్టర్ ట్రైనీలకు (ఏసీఎల్ఎంటీ) ఒక రోజు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలను, నిబంధనలను తప్పనిసరిగా పాటించాలన్నారు. ప్రతి నోడల్ అధికారి క్రియాశీలకంగా పనిచేయాలన్నారు. మాస్టర్ ట్రైనీలు పీఓ బుక్ కచ్చితంగా చదివి అందులోని ప్రతి అంశంపై అవగాహన పెంచుకోవాలన్నారు. ఎన్నికల విధులను నిర్వర్తించే అధికారులందరూ సామర్థ్యాన్ని పెంపొందించుకోవడం, శిక్షణ కార్యక్రమాల కోసం షెడ్యూల్ సిద్ధం చేసుకోవాలని చెప్పారు. ఏ రోజు ఎవరికి శిక్షణ ఇవ్వాలి అనే దానిపై ఎన్నికల కమిషన్ తేదీలను ప్రకటించిందని,ఇందుకనుగుణంగా కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశించారు.ఎన్నికల నిర్వహణకు సామగ్రి సిద్ధం చేసుకోవాలన్నారు.

సిబ్బందిని గుర్తించండి

జిల్లాలో ఎన్నికల నిర్వహణకు అవసరమైన సిబ్బందిని గుర్తించాలని కలెక్టర్ ఆదేశించారు. అధికారుల లభ్యత, వివరాల సేకరణ, డేటా విశ్లేషణ వంటి పనులను సకాలంలో పూర్తి చేయాలని చెప్పారు. ఈవీఎంల భద్రత, ర్యాండమైజేషన్, ఫంక్షనింగ్ చాలా ముఖ్యమన్నారు. ఎన్నికల నిర్వహణలో భాగంగా రవాణ అవసరాలకు సరిపడా వాహనాలను గుర్తించాలన్నారు. జేఎన్‌టీయూ కళాశాలలో రిసెప్షన్ కేంద్రం, వాహనాల పార్కింగ్‌కు ఏర్పాట్లు ముందుగానే చేపట్టాలన్నారు. ఎన్నికల సమయంలో హెల్ప్ లైన్, కాల్‌సెంటర్ ఏర్పాటు చేయాలన్నారు. వాటికి వచ్చే ప్రతి ఫిర్యాదు రికార్డు చేయాలన్నారు. సమావేశంలో జెడ్పీ సీఈఓ వైఖోమ్ నిదియాదేవి, నగర పాలక కమిషనర్ మేఘ స్వరూప్, డిప్యూటీ కలెక్టర్ నీలమయ్య, డీఆర్‌డీఏ పీడీ నరసింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జేఈఈ మెయిన్‌లో సత్తా



పాలగిరి సతీష్‌రెడ్డి, షేక్ ముజమ్మిల్, గోసుకుండ శశికిరణ్, గంపల హరిచాణిక్యరెడ్డి, చక్రధర్‌రెడ్డి

అనంతపురం ఎడ్యుకేషన్: జాయింట్ ఎంట్రన్స్ ఎగ్జామినేషన్ (జేఈఈ) మెయిన్ 2024 ఫేజ్–1 ఫలితాల్లో జిల్లా విద్యార్థులు సత్తా చాటారు. నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్టీఏ) మంగళవారం ఫలితాలను విడుదల చేసింది. బుక్కరాయసముద్రం మండలం చెన్నంపల్లికి చెందిన రైతు పాలగిరి లక్ష్మీరెడ్డి కుమారుడు పాలగిరి సతీష్‌రెడ్డి 99.99 పర్సంటైల్ సాధించాడు. అలాగే అనంతపురం నగరానికి చెందిన బి.షేక్ ముజమ్మిల్ 99.96 పర్సంటైల్ సాధించాడు. ఈ విద్యార్థి తల్లిదండ్రులు నజ్మత్ కౌసర్, కలీముల్లాలు ప్రభుత్వ ఉపాధ్యాయులు. వీరితో పాటు అనంతపురం నగరానికి చెందిన విద్యార్థులు శశికిరణ్ 99.89 పర్సంటైల్, చిగిచెర్ల మేఘన 99.64, పటాన్ ఆసింఖాన్ 99.23, మంగతి నవదీప్ 99.08, గంపల హరి చాణిక్య రెడ్డి 98.88, మన్నెపూరి సిద్ధార్థరెడ్డి 97.85, పొరకల శివప్రసాద్ 97.70, పట్నం భానుప్రకాష్ 97.45, కె.సీతారామచరణ్ 97.27, రాయపాటి వంశీకృష్ణారెడ్డి 97.23, ములకల అమృత్ 97.05, కప్పెత అజయ్‌కృష్ణారెడ్డి 96.79, కురబ శివసాయితేజ 96.52, బి.అనురిద్ 96.45, కూచి అరవింద్ 96.44, ఉప్పిలి మోహిత్‌కుమార్‌రెడ్డి 96.10, తలుపుల ప్రశాంతి 95.37, నాపా మహర్షి 95.30, పొన్నపాటి వినీల 95.26, జయం షణ్ముఖ శివాన్విత 95.25 పర్సంటైల్ సాధించారు. ప్రతిష్టాత్మకమైన జేఈఈ మెయిన్ పరీక్షకు దేశ వ్యాప్తంగా 11.70 లక్షలమంది హాజరయ్యారు. తెలుగు రాష్ట్రాల నుంచి దాదాపు 2.40 లక్షల మంది పరీక్ష రాశారు. ఇందులో ప్రతిభ చాటిన విద్యార్థులు జేఈఈ అడ్వాన్స్‌డ్ పరీక్ష రాసేందుకు అర్హులు.

చక్రధర్‌రెడ్డి మెరుపులు

తాడిపత్రి అర్బన్: జేఈఈ మెయిన్ ఫలితాల్లో తాడిపత్రికి చెందిన సంగటి చక్రధర్‌రెడ్డి మెరిశాడు. 99.91 పర్సంటైల్ సాధించి పలువురితో శభాష్ అనిపించుకున్నాడు. ఈ సందర్భంగా విద్యార్థి తల్లిదండ్రులు శ్రీనివాసరెడ్డి, రాజేశ్వరి సంతోషం వ్యక్తం చేశారు.

సందడే.. సందడి



బాలికల సాంస్కృతిక ప్రదర్శన

అనంతపురం కల్చరల్: స్థానిక ఆర్ట్స్ కళాశాల ఎగ్జిబిషన్ మైదానంలో రెండో రోజు మంగళవారం కూడా బాలోత్సవం సందడిగా సాగింది. చిన్నారులు సాంస్కృతిక ప్రదర్శనలతో ఆకట్టుకున్నారు. ఈ సందర్భంగా బాలోత్సవం కమిటీ చైర్మన్ షమీం షఫీవుల్లా మాట్లాడుతూ తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు చిన్నారుల్లో ఒత్తిడి తగ్గించేందుకు కృషి చేయాలన్నారు. అనంతరం డిప్యూటీ డీఈఓ శ్రీనివాసులు, ఏడీ కృష్ణయ్య, సూపరింటెండెంట్ ఆదినారాయణ, బాలోత్సవం కమిటీ ప్రతినిధులు సావిత్రి, శ్రీనివాసరావు, లింగమయ్య చేతులమీదుగా బహుమతులు అందజేశారు. రాష్ట్రపతి అవార్డు అందుకున్న బిసాతి భరత్, జయమారుతి, జీవన్‌కుమార్, కటకం కృష్ణవేణిని సత్కరించారు. ఎల్కే పీ కార్యదర్శి పద్మజ, విజయ్‌సాయికుమార్ పిల్లలకు భోజన వసతి కల్పించారు. కార్యక్రమంలో న్యాయనిర్ణేతలుగా కత్తి విజయ్‌కుమార్, గాజుల వెంకట సుబ్బయ్య, రియాజుద్దీన్, సాధుశేఖర్, నాగేంద్ర, వన్నూరు మాస్టర్ వ్యవహరించారు.

అవినీతిపరులకు అందలం!

- టీడీపీలో ఇదీ తీరు
- చర్చనీయాంశమైన 'పోలీసు అధికారి' వ్యవహారశైలి

సాక్షి ప్రతినిధి, అనంతపురం: త్వరలో జరగబోయే ఎన్నికల్లో ఎలాగైనా గెలవాలనే ఉద్దేశంతో టీడీపీ అడ్డదారులు తొక్కుతోంది. ఆ పార్టీ అగ్రనేతలు టికెట్‌కు ఇంతని రేటు నిర్ణయించి వసూళ్లకు దిగారు. పోటీలో ఎక్కువ మంది ఉన్నారంటూ కృత్రిమ డిమాండ్ సృష్టించి..రూ.30 కోట్ల నుంచి రూ.40 కోట్లు డిమాండ్ చేస్తున్నారన్న విమర్శలు ఉన్నాయి. ఈ వ్యవహారంపైనే 'తమ్ముళ్లు' మండిపడుతుండగా..ఇప్పుడు మరో కోణం వెలుగు చూసింది. టీడీపీలో అవినీతిపరులను సైతం ప్రోత్సహించడాన్ని సొంత పార్టీ నేతలే తప్పుబడుతున్నారు. అసలే అవినీతి మరక ఉన్న పార్టీకి ఇలాంటి వారి వల్ల మరింత చెడ్డపేరు ఖాయమని అంటున్నారు. తాజాగా ఓ డీఎస్పీ స్థాయి అధికారి వ్యవహారం టీడీపీ శ్రేణుల్లో చర్చనీయాంశంగా మారింది. 'పుట్టపర్తి అభ్యర్థిని నేనే. నాకు మద్దతు ఇవ్వండి' అంటున్న సదరు అధికారి వీడియోలు తీవ్ర చర్చకు దారితీశాయి. ప్రస్తుతం అవి సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతున్నాయి. ఆయనపై ఉమ్మడి జిల్లాలో పలు అవినీతి ఆరోపణలు ఉన్నట్లు తెలుస్తోంది. గతంలో గుప్తనిధుల విషయంలో ఆయన ప్రమేయంపై ఆరోపణలు వచ్చాయి. బోర్‌వెల్స్ విషయంలో రైతుల నుంచి డబ్బులు తీసుకున్నారన్న విమర్శలు ఉన్నాయి. తిరుపతి ట్రాఫిక్ విభాగంలో పనిచేసినప్పుడు కూడా అవినీతి ఆరోపణలు ఎదుర్కొన్నారు. అలాంటి వ్యక్తి ఒక్కసారిగా టీడీపీ కండువా కప్పుకుని వీడియోలు విడుదల చేయడం చర్చనీయాంశంగా మారింది. పార్టీలో కొంతమంది ప్రమేయం లేకుండా ఇది జరగదని సొంత పార్టీ నేతలే అంటున్నారు.

అవినీతికి కేరాఫ్

టీడీపీ మొదట్నుంచీ అవినీతికి కేరాఫ్‌గా ఉంది. ఆ పార్టీ అధినేత చంద్రబాబు స్కిల్‌స్కాం కేసులో జైలుకు వెళ్లొచ్చారు. ఇక ఆ పార్టీ అధికారంలో ఉన్న 2014–19 మధ్యకాలంలో టీడీపీ నాయకులు అడ్డగోలుగా అవినీతికి పాల్పడ్డారు. జన్మభూమి కమిటీల పేరుతో అరాచకం చేశారు. నీరు–చెట్టు పనుల్లో దొరికినంత దోచుకున్నారు. మట్టి, ఇసుక కొల్లగొట్టారు. ఆ పార్టీ నేతల దందాలపై 'పచ్చ'పత్రికల్లోనే వార్తలు వచ్చాయి. ఇప్పుడు కూడా ఆ పార్టీ అదే తోవలో వెళుతూ అవినీతిపరులను ప్రోత్సహిస్తోందన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

క్లుప్తంగా

ముగిసిన రైల్వే క్రీడా పోటీలు



విజేతలతో రైల్వే ఉన్నతాధికారులు

గుత్తి: గుత్తి ఆర్‌ఎస్‌లోని రైల్వే ఇన్‌స్టిట్యూట్ క్రీడా మైదానంలో వారం రోజులుగా రైల్వే అధికారులు, కార్మికుల జట్ల మధ్య జరుగుతున్న క్రీడా పోటీలు మంగళవారం ముగిశాయి. క్రికెట్‌లో రైల్వే ఆపరేటింగ్ డిపార్ట్‌మెంట్ విన్నర్స్‌గా, రన్నింగ్ డిపార్ట్‌మెంట్ రన్నర్స్‌గా నిలిచాయి. వాలీబాల్ పోటీల్లో మీనా స్టార్ టీం విన్నర్స్, రాజస్తాన్ టీం రన్నర్స్‌గా నిలిచాయి. క్రికెట్, వాలీబాల్‌తో పాటు కార్యమ్స్, చెస్, షటిల్ బ్యాడ్మింటన్ సింగిల్, డబుల్స్ విభాగాల్లో విజేతలకు ముఖ్య అతిథులు డీఎంఈ ప్రమోద్, ఎస్‌ఎంఆర్ సురేష్ బాబు, సీసీసీ విశ్వనాథ్ బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఓపెన్ లైన్ బ్రాంచ్ సెక్రెటరీ శేఖర్‌బాబు, సుధీర్‌బాబు, రైల్వే ఇన్‌స్టిట్యూట్ సెక్రెటరీ రవి కుమార్ పాల్గొన్నారు.

అర్చకుడిపై దాడికి యత్నించిన హిజ్రాలు



హిజ్రాలతో మాట్లాడుతున్న సీఐ మహేశ్వరరెడ్డి

గుంతకల్లు రూరల్: జి.కొట్టాలలో ముత్యాలమ్మ ఆలయ అర్చకుడు ముత్యాల గంగరాజుపై మంగళవారం హిజ్రాలు దాడికి యత్నించారు. గత కొద్ది రోజుల క్రితం ఆలయానికి వచ్చిన భక్తులనుద్దేశించి గర్భిణులెవరూ హిజ్రాలకు దానం చేయవద్దని సూచించారు. ఇది సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. విషయం తెలుసుకున్న హిజ్రాలు మంగళవారం అర్చకుడిపై దాడికి యత్నించారు. రూరల్ పోలీసులు హుటాహుటిన జి.కొట్టాలకు చేరుకొని హిజ్రాలను అడ్డుకున్నారు. అర్చకుడితో పాటు హిజ్రాలను పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అర్చకుడితో హిజ్రాలకు క్షమాపణ చెప్పించారు.



ప్రేమ ఒక అనిర్వచనీయమైన అనుభూతి. మాటలకు అందని మధుర భావన. రెండక్షరాలనే కాదు రెండు హృదయాలనూ ఒకటి చేయగల మహత్తర సాధనం. ప్రపంచాన్ని మరచిపోయేటట్టు చేసి గుప్పెడంత గుండెలో గిలిగింతలు పెట్టే తీయని జ్ఞాపకం. అంత గొప్ప ప్రేమను పొందాలని ఎవరైనా అనుకుంటారు. జీవిత గమనంలో అందమైన స్థానం కల్పిస్తూ నిరంతర నవ్వుల పువ్వులలో వికసించాలని ఆనందించే వారి కోసమే 'వాలంటైన్స్ డే' వచ్చి వాలింది. ప్రేమికుల రోజు సందర్భంగా బుధవారం ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా కొన్ని రెస్టారెంట్లలో ఆఫర్లను పెట్టి మరింత ప్రత్యేకతను తీసుకొచ్చారు. – అనంతపురం కల్చరల్

మధురమైన ప్రేమ

సందర్భం- నేడు 'వాలెంటైన్స్ డే'

ప్రేమ ఒక పవిత్ర భావన



భగవంతుడు పుట్టినప్పుడే అన్నీ ఇస్తాడు. ఇంటి వద్ద కాకుండా మన జీవితంలో వెతికి తెచ్చుకోవాల్సింది మంచి స్నేహితులను మాత్రమే. అందులో విజ్ఞత చూపించకపోతే జీవితాంతం బాధపడవలసి వస్తుందంటారు అనంతపురానికి చెందిన సురేష్, ఉమ్మెరుమాన్. వీరిద్దరూ వేర్వేరు మతాలకు చెందిన వారైనా కదిరిలో ఉన్న రోజుల్లో ప్రేమించి పెళ్లి చేసుకున్నారు. ఒకరికోసం మరొకరు అన్నట్టు ఎన్ని కష్టాలు వచ్చినా కలిసి ఆనందంగా జీవిస్తున్నారు. విజయ రహస్యమేమిటని అడిగితే 'వాలెంటైన్స్ డే అంటే ప్రేమికులకు మాత్రమే అనే అర్థం స్థిరపడిపోవడం వలన దాని గురించి మాట్లాడడానికే సిగ్గు పడతారు. ఎవరిని చూసినా ప్రేమించాలనుకోవడం వయసు మహత్యం. అదొక ఆకర్షణ. నిజమైన ప్రేమ ఒక మతాతీతమైన పవిత్ర భావన. అది జీవితాంతం కలిసుండేలా చేయగలగాలి. అయితే ప్రేమకు ముందు స్థిరపడడం నేర్చుకోవాలి' అంటున్నారు ఆ దంపతులు.

ప్రేమిస్తే తల్లిదండ్రులను ఒప్పించాలి



అనంతపురానికి చెందిన నాగరాజు, ఆశాలతది నాలుగు దశాబ్దాల ప్రేమ బంధం. ప్రేమకు కులాలు లేవంటారు. అయితేనేం వీరి ప్రేమ అనేక ఏళ్ల నిరీక్షణ తర్వాత వారి కథ పెళ్లి పీటలు చేరింది. తీయని అనుబంధంగా మారింది. చాలామంది ప్రేమించుకుంటున్నపుడు ఉండే శ్రద్ధ పెళ్లి విషయానికొచ్చేసరికి అంతగా ఉండదు. అందువల్ల ప్రేమ వివాహాలంటేనే తల్లిదండ్రులు భయపడుతుంటారు. ఏళ్లతరబడి నిరీక్షించే ప్రేమకు 'పెళ్లి' చివరి మజిలీ కావాలి. అప్పుడే సార్థకత చేకూరుతుందంటారు వారు. 'మా పెళ్లి కూడా అదేవిధంగా సాగింది. అనంతపురం ఆర్ట్స్ కాలేజ్‌లో డిగ్రీ చదువుకునే సమయంలో మేము ప్రేమించుకున్నాము. ఒకరిది ఆర్థికంగా బాగా స్థిరపడిన కుటుంబమైతే మరొకరిది దిగువ మధ్యతరగతి కుటుంబం. ఆర్థికంగా ఎదగడానికి ఒకరికొకరి సహకారంతో ఎదిగి ప్రస్తుతం ఇద్దరి పిల్లల పెళ్లిళ్లు చేశాము. ప్రేమ వివాహాలు తప్పు కాదు. కానీ పెద్దలను ఒప్పిస్తే ప్రశాంతంగా ఉండొచ్చు' అంటున్నారు.

ప్రేమించి పెళ్లి చేసుకున్నాం



ఈ ఫొటోలో కనిపిస్తున్న బుక్కరాయసముద్రం మండలం జంతలూరు గ్రామానికి చెందిన బండారు నాగలింగ, ఆదిలక్ష్మి ప్రేమించుకున్నారు. ఇద్దరి ఇష్టాయిష్టాలు కలిశాయి. ప్రేమించిన అమ్మాయిని పెళ్లి చేసుకోవాలని నాగలింగ నిర్ణయించుకున్నాడు. పెద్దలకు చెబితే ఒప్పుకోలేదు. దీంతో ఇళ్ల నుంచి బయటికొచ్చేసి ప్రేమ వివాహం చేసుకున్నారు. ప్రస్తుతం హైదరాబాద్‌లోని శంషాబాద్‌లో నివాసముంటున్నారు. నాగలింగ రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తున్నారు. వీరికి ఒక పాప. ఆనందంగా జీవనం సాగిస్తున్నారు. ఇరు కుటుంబాల వారూ సంతోషంతో దీవెనలందిస్తున్నారు.



కదిరిలో ఉన్న చంద్రవదన, మోహియార్‌ల సమాధులు

ప్రేమకు ప్రతిరూపం ఈ సమాధులు

కదిరి : 'ప్రేమ కన్నా దివ్యమైన మాధుర్యం లేదు.. ప్రేమ లేని జీవితం ఒక జీవితమే కాదు..ఇద్దరి మనసులు కలిసిన క్షణమే ఒక సుముహూర్తం' అని ఇలా ప్రేమను ఎన్నో రకాలుగా వర్ణిస్తుంటారు. కదిరి పట్టణంలోని ఈద్గాలో ఉన్న చంద్రవదన, మోహియార్‌ల సమాధులను హిందూ,ముస్లింల ఐక్యతకు అలాగే ప్రేమకు ప్రతిరూపంగా కూడా చెప్పవచ్చు. ఇంతకీ వారి యదార్థ ప్రేమ గాథ ఏంటో ప్రేమికుల దినోత్సవం సందర్భంగా మీకోసం..

15వ శతాబ్దంలోని విజయనగర సామ్రాజ్యంలో కదిరి మండలం పట్నంలో రంగరాయలు అనే సామంతరాజు ఉండేవారు. ఆయన ఒక్కగానొక్క కుమార్తె చంద్రవదన. ఈమె ఖాద్రీ లక్ష్మీ నరసింహ స్వామిని దర్శించుకునేందుకు విచ్చేసేవారు. అప్పట్లో పర్షియా దేశం నుంచి వజ్రాల వ్యాపారం నిమిత్తం మోహియార్ అనే యువకుడు కదిరికి వచ్చాడు. ఓరోజు తన వజ్రాల దుకాణం ముందు గుండా వెళుతున్న చంద్రవదనను చూసి ఆ యువకుడు ప్రేమలో పడతాడు. ఆమె కూడా అతని ప్రేమలో పడింది. ఇలా రోజూ గుడికి విచ్చేస్తూ దారిలో ఒకరికొకరు చూసుకుంటూ తమ ప్రేమను కొనసాగించేవారు.

ప్రేయసి కోసం కదిరిలోనే..

వజ్రాల వ్యాపారం నిమిత్తం తనతో పాటు పర్షియా దేశం నుంచి విచ్చేసిన వారందరూ తమ దేశానికి వెళ్లిపోగా మోహియార్ మాత్రం చంద్రవదన కోసం కదిరిలోనే ఉండిపోయాడు. కొన్ని రోజులుగా తన ప్రేయసి కన్పించకపోయేసరికి ఓరోజు ఆమెను చూసేందుకు మోహియార్ పట్నం వెళతాడు. అయితే అక్కడున్న రాజభటులు అతన్ని అడ్డుకుంటారు. ఇలా రోజూ వెళ్లడం, వారు అడ్డుకోవడం జరుగుతుంటే చివరకు ప్రేమ పిచ్చోడిగా మారి ఓరోజు ఇంట్లోకి బలవంతంగా ప్రవేశించేందుకు రాజభటులను ఎదిరిస్తాడు. అతన్ని రాజభటులు బలవంతంగా నెట్టడంతో కిందపడినప్పుడు అక్కడున్న రాయి తలకు బలంగా తగిలి అక్కడికక్కడే ప్రాణాలు వదిలాడు. విషయం తెలిసి చంద్రవదన బోరున విలపిస్తూ తన ప్రియుడి మృతదేహంపై పడి ఆమె కూడా కన్ను మూసింది. ఇది తెలిసి ఆమె తండ్రి రంగ రాయలు తన రాజగురువులు, పెద్దల సలహా మేరకు ఇరువురి మృతదేహాలను కదిరిలోని ఈద్గాలో హిందూ, ముస్లింల సంప్రదాయం ప్రకారం ఒకే చోట ఖననం చేసి వారి ప్రేమకు ప్రతిరూపంగా సమాధులు నిర్మించారు.

ప్రతి జర్నలిస్టుకూ ఇంటి స్థలం

- కలెక్టర్‌ను ఆదేశించిన మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి



మంత్రిని కలిసిన జర్నలిస్టులు

అనంతపురం టవర్‌క్లాక్: అక్రిడిటేషన్ కలిగిన ప్రతి జర్నలిస్టుకూ ఇంటి స్థలం మంజూరు చేయాలని కలెక్టర్ గౌతమికి జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఆదేశించారు. మంగళవారం రాప్తాడులో 'సిద్ధం' సభ ఏర్పాట్ల పరిశీలన అనంతరం నగరంలోని ఆర్‌అండ్‌బీ అతిథి గృహానికి వచ్చిన మంత్రిని జర్నలిస్టులు కలిశారు. జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ఆదేశాలు జారీ చేశారన్నారు. అందుకు అనుగుణంగా జర్నలిస్టులకు ఇంటి స్థలాలు ఇప్పించేలా చూడాలని కోరారు. దీనిపై స్పందించిన మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి కలెక్టర్‌కు ఫోన్ చేసి అక్రిడిటేషన్ కలిగి దరఖాస్తు చేసుకున్న ప్రతి జర్నలిస్టుకూ ఇంటి స్థలం మంజూరు చేయాలని ఆదేశించారు. మంత్రిని కలిసిన వారిలో సీనియర్ జర్నలిస్టులు శివారెడ్డి (సాక్షి), శ్రీనివాసులు (ఎన్టీవీ), నరేష్ (టీవీ9), వెంకటరెడ్డి (వార్త), సాయినాథ్‌రెడ్డి (వైఎస్సార్ టీవీ), సుదర్శన్‌రెడ్డి, మురళి ఉన్నారు.

'శింగనమల'కు టీడీపీ ఇన్‌చార్జ్ లేరు

- పార్టీ నియోజకవర్గ పరిశీలకుడు గుర్రప్ప

శింగనమల: నియోజకవర్గానికి టీడీపీ ఇన్‌చార్జ్‌గా ఎవరూ లేరని ఆ పార్టీ ఎన్నికల పరిశీలకుడు గుర్రప్ప, ద్విసభ్య కమిటీ సభ్యులు ఆలం నరసానాయుడు, ముంటిమడుగు కేశవరెడ్డి అన్నారు. మంగళవారం బుక్కరాయసముద్రంలో ఆ పార్టీ నేత బండారు శ్రావణికి వ్యతిరేకంగా నాయకులు, కార్యకర్తల సమావేశం నిర్వహించారు. 4 రోజుల క్రితం బండారు శ్రావణి తన సొంత గ్రామమైన సిద్దరాంపురంలో నిర్వహించిన కార్యక్రమానికి పోటీగా సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పార్టీ అధిష్టానం ఇప్పటివరకూ ఎవరికీ శింగనమల నియోజకవర్గ ఇన్‌చార్జ్ బాధ్యతలు అప్పగించలేదన్నారు. అయితే, కొంత మంది ఇన్‌చార్జ్‌ను, ఎమ్మెల్యే అభ్యర్థిని తానే అంటూ ప్రచారాలు చేసుకుంటున్నారని పరోక్షంగా బండారు శ్రావణిని విమర్శించారు. ఇలా చెప్పుకునేవారు టీడీపీ కార్యకర్తలపై తప్పుడు కేసులు పెట్టించారని విమర్శించారు. తమ సహనాన్ని పరీక్షించవద్దంటూ ద్విసభ్య కమిటీ సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు. 5 సంవత్సరాలు ప్రజా సమస్యలు గాలికి వదిలేసి, ఇప్పుడు పార్టీలో చిచ్చు పెడుతున్నారని మండిపడ్డారు. పార్టీ అభ్యర్థిని నిర్ణయించేది అధిష్టానమని, ఎవరి మాటలూ నమ్మవద్దని వారు సూచించారు.

మార్కెటింగ్ ఫీజు లక్ష్యం రూ.16.84 కోట్లు

అనంతపురం అగ్రికల్చర్: మార్కెటింగ్ శాఖ ద్వారా ఏప్రిల్ నుంచి ప్రారంభం కానున్న 2024–25 ఆర్థిక సంవత్సరంలో రూ.16.84 కోట్ల మేర వివిధ రకాల ఫీజులు వసూలు చేయాలని మార్కెట్ కమిటీలకు సూత్రప్రాయంగా టార్గెట్లు ఇచ్చారు. బడ్జెట్ అంశంపై మంగళవారం అనంతపురం మార్కెటింగ్‌శాఖ కార్యాలయంలో ఉమ్మడి జిల్లా ఏడీఎంలు పి.సత్యనారాయణచౌదరి, లక్ష్మీనారాయణమూర్తి, ఆర్డీడీ బి.శ్రీకాంత్‌రెడ్డితో కలిసి రీజనల్ జాయింట్ డైరెక్టర్ (ఆర్జేడీ) సి.రామాంజనేయులు సమావేశం నిర్వహించారు. గత ఐదు సంవత్సరాల కాలంలో మార్కెట్ కమిటీలకు ఇచ్చిన టార్గెట్లు, సాధించిన ప్రగతి, ఫీజు వసూళ్లకు ఉన్న అవకాశాలపై చర్చించారు. అలాగే ప్రస్తుతం రెండు జిల్లాల్లో ఉన్న 17 మార్కెట్ యార్డులు, 30 చెక్‌పోస్టుల ద్వారా సాధించిన వసూళ్ల గురించి ఆరా తీశారు. వసూళ్లలో వెనుకబడిన గుత్తి, గుంతకల్లు, పెనుకొండ, తనకల్లు తదితర ఐదారు కమిటీల్లో వచ్చే ఏడాది వసూళ్ల పెంపునకు తీసుకోవాల్సిన చర్యలపై దిశా నిర్దేశనం చేశారు. స్వల్ప మార్పులతో వచ్చే ఏడాది టార్గెట్లు కేటాయించారు. అనంతపురం జిల్లాలో ఉన్న 9 కమిటీలకు రూ.11.75 కోట్లు, శ్రీసత్యసాయి జిల్లాలో ఉన్న ఏడు మార్కెట్ కమిటీలకు రూ.5.09 కోట్లు లక్ష్యంగా నిర్దేశించారు. పశువులు, జీవాల సంతలు, చింతపండు, మిరప, చీనీ మార్కెట్ల విస్తరణ, రైతులకు మెరుగైన సేవలు అందించడానికి చర్యలు తీసుకోవాలని సూచించారు.

జార్ఖండ్‌వాసి ఆత్మహత్య

రాప్తాడు: జార్ఖండ్ వాసి అబుజైద్ అన్సరీ సోమవారం రాత్రి ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. వివరాలు ఇలా ఉన్నాయి. అబుజైద్ అన్సరీ, తమయ నదిని దంపతులు బతుకు తెరువు కోసం ఏడాది కిందట అనంతపురం వచ్చారు. ఆరు నెలల కిందట అనంతపురం నుంచి రాప్తాడుకు వచ్చి మసీదు దగ్గర ఒక ఇంట్లో అద్దెకు దిగారు. పోలీస్‌స్టేషన్ ఎదురుగా చికెన్ సెంటర్‌లో వంట మాస్టరుగా వెళ్లేవాడు. మతిస్థిమితం సరిగా ఉండకపోవడంతో నాలుగైదుసార్లు ఇల్లు విడిచి ఇతర ప్రాంతాలకు వెళ్లిపోయి మళ్లీ తిరిగి వచ్చాడు. సోమవారం రాత్రి ఇంట్లో నుంచి బయటకు వెళ్లాడు. మంగళవారం తెల్లవారుజామున ఇంటి పక్కనే ఉన్న వేపచెట్టుకు ఉరికి వేలాడుతూ కనిపించాడు. మృతుడికి ఒక కుమార్తె ఉంది. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రేపు కబడ్డీ జట్ల ఎంపిక

గుంతకల్లు: పట్టణంలోని రాజేంద్ర ప్రసాద్ మున్సిపల్ హైస్కూల్ ఆవరణలో ఈ నెల 15న అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాల జూనియర్ కబడ్డీ జట్లను ఎంపిక చేయనున్నట్లు అనంతపురం జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షుడు మంజునాథ్‌రెడ్డి, కార్యదర్శి లక్ష్మణ్ తెలిపారు. బాలబాలికలు 16 సంవత్సరాలు లోపు వయసు ఉండాలని, ఆధార్‌కార్డుతో హాజరుకావాలని సూచించారు. ఎంపికైన జట్లు సత్తెనపల్లిలో జరిగే రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీల్లో పాల్గొంటాయన్నారు.

మాట నిలబెట్టుకున్న జగన్

- చిట్టూరు వద్ద పెన్నానదిపై బ్రిడ్జి నిర్మాణం పూర్తి
- రాకపోకలు ప్రారంభించిన ఎంపీ రంగయ్య, ఎమ్మెల్యే పెద్దారెడ్డి



బ్రిడ్జిపై నడిచి వస్తున్న ఎంపీ తలారి రంగయ్య, ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి

పెద్దవడుగూరు : పాదయాత్ర సమయంలో చిట్టూరు, తరిమెల గ్రామాల ప్రజలకు ఇచ్చిన మాటను అధికారంలోకి వచ్చిన తర్వాత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిలబెట్టుకున్నారని అనంతపురం ఎంపీ తలారి రంగయ్య, తాడిపత్రి ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి తెలిపారు. చిట్టూరు వద్ద పెన్నానదిపై నిర్మించిన నూతన బ్రిడ్జిని వారు మంగళవారం ప్రారంభించారు. ఎంపీ, ఎమ్మెల్యే మాట్లాడుతూ పాదయాత్ర సమయంలో పై రెండు గ్రామాల ప్రజలు రాకపోకలకు పడుతున్న ఇబ్బందులను తెలుసుకున్నారని చెప్పారు. వర్షాకాలంలో నదిలోంచి నడుచుకుంటూ అవతలికి వెళ్లాల్సి వస్తోందని ప్రజలు తెలియజేశారన్నారు. సీఎం అయ్యాక ఉన్నతాధికారులతో మాట్లాడి పెన్నానదిపై లోలెవల్ పైపు కల్వర్టు నిర్మించడానికి చర్యలు చేపట్టారన్నారు. ఇందుకు రూ.3.50 కోట్ల నిధులు మంజూరు చేశారని తెలిపారు. బ్రిడ్జి నిర్మాణం పూర్తయ్యి వినియోగంలోకి రావడంతో చిట్టూరు, నాగలాపురం, చిత్రచేడు, గోపురాజుపల్లి, రాంపురం తదితర గ్రామాల ప్రజలకు అత్యవసర సమయంలో అనంతపురం వెళ్లడానికి మార్గం సుగమమైందన్నారు. ప్రజల కష్టాలను తీర్చి.. సంక్షేమ ఫలాలను అందిస్తున్న వైఎస్సార్‌సీపీని మరోసారి అధికారంలోకి తీసుకురావాల్సిన బాధ్యత ప్రజలందరిపై ఉందన్నారు. బ్రిడ్జి నిర్మాణం పూర్తి చేయడంలో పంచాయతీరాజ్ ఎస్‌ఈ భాగ్యరాజ్, ఈఈ కొండయ్య, డీఈ రజనీకాంతరెడ్డి, ఏఈ సురేష్‌రెడ్డి ఎంతో కృషి చేశారని కొనియాడారు. అనంతరం చిట్టూరు – తరిమెలకు పెన్నానదిపై బ్రిడ్జికి అటు వైపున, ఇటు వైపున రూ.5 కోట్లతో చేపట్టనున్న సీసీ రోడ్డు పనులకు సంబంధించి శిలాఫలకం ఆవిష్కరించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం రాష్ట్ర కార్యదర్శి పేరం స్వర్ణలత, వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి శేషారెడ్డి, మండల కన్వీనర్ ఎద్దుల శరభారెడ్డి, యువజన విభాగం మండల కన్వీనర్ కృష్ణారెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి పాశం రంగస్వామియాదవ్, అనంతపురం పార్లమెంట్ యువజన విభాగం ప్రధాన కార్యదర్శి రామచంద్రారెడ్డి, బీసీ విభాగం మండల నాయకులు వెంకటస్వామిగౌడ్, చిట్టూరు సీనియర్ నేత భాస్కర్‌రెడ్డితో పాటు తరిమెల గోకుల్‌నాథరెడ్డి, కాంట్రాక్టర్ శివారెడ్డి, తాడిపత్రి కందిగోపుల మురళీధర్‌రెడ్డి, చిన్నవడుగూరు మధు, గుత్తి అనంతపురం సర్పంచ్ మురళీధర్‌రెడ్డి, రామాంజులరెడ్డి, ఓబుళపతి, రామచంద్ర, ప్రకాష్‌రెడ్డి, పరమేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఫిషరీస్ త్రీమెన్ కమిటీ ప్రమాణస్వీకారం

అనంతపురం అగ్రికల్చర్: మత్స్యకార సహకార సంఘం జిల్లా యూనియన్‌కు రాష్ట్ర ప్రభుత్వం త్రీమెన్ కమిటీ ప్రకటించిన నేపథ్యంలో మంగళవారం వారు ప్రమాణాస్వీకారం చేశారు. నగరంలోని మత్స్యశాఖ ఉప సంచాలకుల కార్యాలయం ఆవరణలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో బెస్త కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ కేవీ రమణ, పలువురు మత్స్యకారుల సమక్షంలో ఫిషరీస్ డీడీ శ్రీనివాసనాయక్ త్రీమెన్ కమిటీ సభ్యులతో ప్రమాణం చేయించారు. ఎన్నికలు జరిగే వరకు వైటీ చెరువు సొసైటీ అధ్యక్షుడు కోట నరసప్ప, మర్తాడు సొసైటీ అధ్యక్షుడు బెస్త సుబ్బన్న, పాతకొత్తచెరువు సొసైటీ నుంచి బోయ సహదేవ... ఈ ముగ్గురు త్రీమెన్ కమిటీ సభ్యులుగా ఉంటారని ప్రభుత్వం ఇటీవల ఉత్తర్వులు జారీ చేయడంతో వారు మంగళవారం అట్టహాసంగా బాధ్యతలు తీసుకున్నట్లు ఎఫ్‌డీఓ ఫక్కీరప్ప తెలిపారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, జిల్లాకు చెందిన ప్రజాప్రతినిధులు సహకారంతో వచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని మత్స్యకార వర్గాలు, చేపల పెంపకంపై ఆధారపడి జీవనం సాగిస్తున్న పేద వర్గాల అభ్యున్నతికి తమ వంతు కృషి చేస్తామని త్రీమెన్ కమిటీ సభ్యులు తెలిపారు. ఫిష్ ఆంధ్రా పేరుతో రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సహకాలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

రౌడీషీటర్ హత్య కేసు ఛేదింపు

- ఐదుగురు నిందితుల అరెస్ట్

అనంతపురం: రౌడీషీటర్ సయ్యద్ జిలాన్ అలియాస్ కుక్కల జిలాన్ హత్య కేసును అనంతపురం వన్‌టౌన్ పోలీసులు ఛేదించారు. ఆర్థిక లావాదేవీలు బెడిసి కొట్టడం వల్లే హత్య జరిగినట్లు తేల్చారు. ఈ కేసులో ఐదుగురు నిందితులను అరెస్టు చేశారు. ఇందుకు సంబంధించిన వివరాలను సీఐ రెడ్డప్ప మీడియాకు వెల్లడించారు. 2021 సంవత్సరంలో శ్రీకృష్ణదేవరాయనగర్‌లో జరిగిన ఓ హత్య కేసులో నిందితుడిగా ఉన్న సయ్యద్ జిలాన్ అలియాస్ కుక్కల జిలాన్‌పై వన్ టౌన్ పోలీస్ స్టేషన్‌లో రౌడీషీట్ తెరిచారు. ఇదిలా ఉండగా సయ్యద్ జిలాన్‌తో కలిసి ప్రసాద్, నరేష్ బేల్దారి పనులు చేసేవారు. బట్వాడా డబ్బు విషయంలో వీరి మధ్య విభేదాలు తలెత్తాయి. ఈ క్రమంలో జిలాన్‌ను చంపాలని మిగిలిన ఇద్దరు పన్నాగం పన్నారు. సోమవారం సింధూర వైన్స్ దుకాణం వద్దకు ప్రసాద్, నరేష్‌లు జిలాన్‌ను పిలిపించారు. ఈ ఇద్దరితో పాటు నరేష్ బావ యల్లప్ప, తమ్ముడు ప్రతాప్, చెల్లెలు సువర్ణ సహకారం తీసుకుని పథకం ప్రకారం ఐదుగురు కలిసి రాయితో మోదారు. అక్కడికక్కడే జిలాన్ చనిపోయాడు. అడ్డుకోవడానికి ప్రయత్నించిన హతుడి స్నేహితుడు చంద్రశేఖర్‌పై కట్టెతో దాడి చేసి గాయపరిచారు. హత్య జరిగిన 24 గంటల్లోనే నిందితులైన పండ్యాల ప్రసాద్, నరేష్, ఎల్లప్ప, ప్రతాప్, సువర్ణలను మంగళవారం ఎన్టీఆర్ మార్గ్ వద్ద పోలీసులు అరెస్టు చేశారు. మెజిస్ట్రేట్ ఆదేశాల మేరకు నిందితులను రిమాండ్‌కు తరలించారు. వీరి నుంచి మూడు ద్విచక్రవాహనాలు స్వాధీనం చేసుకున్నారు. కేసును ఛేదించిన సీఐ రెడ్డప్ప, ఎస్ఐ వెంకటేశ్వర్లు బృందాన్ని ఎస్పీ అన్బురాజన్ అభినందించారు.

'సిద్ధం' సభకు వలంటీర్లుగా ముందుకొచ్చిన విద్యార్థులు



వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం నాయకులు, విద్యార్థులతో కలిసి మాట్లాడుతున్న ఎమ్మెల్సీ తలశిల రఘురాం

- సీఎం సభలో సేవలందిస్తామంటున్న విద్యార్థులు
- సీఎం ప్రోగ్రామ్స్ కో ఆర్డినేటర్ తలశిల రఘురాంతో భేటీ

అనంతపురం ఎడ్యుకేషన్: రాప్తాడులో ఈ నెల 18న జరుగనున్న వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి 'సిద్ధం' సభకు రాయలసీమ జిల్లాల నుంచి లక్షలాది మంది పార్టీ శ్రేణులు హాజరుకానున్నారు. ఏ చిన్నలోటుపాట్లు తలెత్తకుండా ఏర్పాట్లకు అన్ని విధాలా చర్యలు తీసుకుంటున్నారు. ఈ క్రమంలో వలంటీర్లుగా పనిచేసేందుకు విద్యార్థులు స్వచ్ఛందంగా ముందుకొచ్చారు. వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం రాష్ట్ర అధ్యక్షుడు పానుగంటి చైతన్య నేతృత్వంలో వచ్చిన పలువురు విద్యార్థులతో మంగళవారం సిద్ధం సభాస్థలి వద్ద ముఖ్యమంత్రి ప్రోగ్రామ్స్ కోఆర్డినేటర్, ఎమ్మెల్సీ తలశిల రఘురామ్ భేటీ అయ్యారు. వలంటీర్లుగా విద్యార్థులు అందించాల్సిన సేవలపై తలశిల దిశానిర్దేశం చేశారు. జరగబోయే ఎన్నికల యుద్ధంలో విపక్షాలన్నీ కట్టగట్టుకుని జగనన్న ప్రజా ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమం మీద, ప్రతి ఇంటికీ మనం చేస్తున్న మంచి, అభివృద్ధి మీద దాడి చేస్తున్నాయన్నారు. పేదోడి బంగారు భవిష్యత్తును ప్రశ్నార్థకంగా మార్చే కుట్రలు జరుగుతున్నాయని ఆరోపించారు. ఈ పరిస్థితుల్లో అన్ని వర్గాల ప్రజలు ఆలోచించాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. చంద్రబాబు దుష్ట సైన్యాన్ని, వారి కుట్రల్ని, కుతంత్రాల్ని, చీల్చి, చెండాడటానికి, మళ్లీ జగనన్నను ముఖ్యమంత్రిగా చేసుకునేందుకు సిద్ధంగా ఉండాలని తలశిల రఘురామ్ పిలుపునిచ్చారు. విద్యార్థి విభాగం రాష్ట్ర అధ్యక్షుడు పానుగంటి చైతన్య మాట్లాడుతూ ప్రభుత్వం అమలు చేస్తున్న రాబోయే తరం విద్యా విధానాన్ని నీరుగార్చేందుకు పెత్తందార్లంతా ఏకమవుతున్నారని ఆరోపించారు. పోర్టులు, హార్బర్లు, మెడికల్ కాలేజీలు, నాడు–నేడుతో మారుతున్న స్కూళ్లు, ఆస్పత్రులు, పారిశ్రామిక అభివృద్ధి, మొత్తంగా రాష్ట్ర అభివృద్ధి మీద వారి దండ యాత్ర కొనసాగుతుందన్నారు. వారి కుట్రలను విద్యార్థిలోకం తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. సమావేశంలో విద్యార్థి విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడు నరేంద్రరెడ్డి, అనంతపురం జిల్లా అధ్యక్షుడు సుధీర్‌రెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాఘవ, రాష్ట్ర అధికార ప్రతినిధి కేశవ, రాష్ట్ర కార్యదర్శి షెక్షావలి, నాయకులు శ్రీకాంత్, రమేష్, విజయ్, ఆదాం, కిరణ్, అనిల్, వినోద్, ప్రశాంతి, కోమల, ఇమ్రాన్, ఇర్షాద్, చంద్ర, పవన్ పాల్గొన్నారు.

ప్రతిపక్ష పార్టీల'ఉనికి' పాట్లు

- ఎవరెన్ని విమర్శలు చేసినా మళ్లీ వైఎస్సార్ సీపీదే అధికారం
- ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి



42వ డివిజన్‌లో ఇంటింటికీ వైఎస్సార్ సీపీ కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి

అనంతపురం కార్పొరేషన్: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీని ప్రజల విశ్వసించి గత ఎన్నికల్లో పట్టం కట్టారు.. వారి నమ్మకాన్ని వమ్ము చేయకుండా నియోజకవర్గంలో ఊహకందని సంక్షేమం, అభివృద్ధి పనులు చేసి చూపామని, ప్రజల్లోకి వెళ్లేందుకు ధైర్యం లేని టీడీపీ, జనసేన బీజేపీ, తదితర ప్రతిపక్ష పార్టీలు ఉనికిపాట్లు పడుతున్నాయని ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి విమర్శించారు. మంగళవారం నగరంలోని 42వ డివిజన్‌లో ఇంటింటికీ వైఎస్సార్ సీపీ కార్యక్రమం జరిగింది. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో జరిగిన సంక్షేమం, అభివృద్ధికి సంబంధించిన కరపత్రాలను ఎమ్మెల్యే ప్రజలకు అందించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ నగరంలో జరిగిన అభివృద్ధి, ప్రజలకు అందుతున్న సంక్షేమంపై ప్రతిపక్ష పార్టీలకు అక్కసు అని అన్నారు. ప్రజలు మేలు చేస్తున్న ప్రభుత్వాన్ని లక్ష్యం చేసుకుని విమర్శలు చేస్తున్నాయన్నారు. ఎల్లో మీడియాను అడ్డం పెట్టుకుని విష ప్రచారం చేస్తున్నాయన్నారు. ఎవరెన్ని కుట్రలు చేసినా రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వానిదే అధికారమని, మరోమారు సీఎంగా వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఉంటారన్నారు. రెట్టింపు సంక్షేమం, అభివృద్ధిని ప్రజలకు అందించి తీరుతామన్నారు.

రూ.వేల కోట్ల సంక్షేమం, అభివృద్ధి:

2014 నుంచి 2019లో కేంద్రంలో బీజేపీ, రాష్ట్రంలో టీడీపీ, వారికి తోక పార్టీగా ఉన్న జనసేన ప్రజలకు ఏం చేశారో చెప్పాలని ఎమ్మెల్యే అనంత అన్నారు. నియోజకవర్గంలో అభివృద్ధిని గాలికొదిలేశారన్నారు. ఇక సంక్షేమాన్ని ఏమాత్రం పట్టించుకోలేదన్నారు. దాంతో పాటుగా గ్రూపు రాజకీయాలతో నగరంలో అలజడి వాతావరణం సృష్టించారే తప్ప..ఏనాడూ ప్రజలకు మేలు చేద్దామని ఆలోచించలేదన్నారు. వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వంలో నియోజకవర్గంలో రూ.వేల కోట్లతో సంక్షేమం, అభివృద్ధి చేసి చూపామన్నారు. అర్హతే ప్రమాణికంగా సంక్షేమం అందించామన్నారు. నగరపాలక సంస్థ పరిధిలో రూ.800 కోట్లతో రోడ్లు, విస్తరణ, కాలువలు, బ్రిడ్జిలు ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. నాడు-నేడు కింద రూ.300 కోట్లతో ఆస్పత్రి విస్తరించేలా చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు. పేద ప్రజలకు కార్పొరేట్ వైద్యం అందించేలా సూపర్ స్పెషాలిటీ, సర్వజనాస్పత్రి, పట్టణ ఆరోగ్య కేంద్రాలను బలోపేతం చేసినట్లు తెలిపారు. ఖరీదైన విద్య, వైద్యాన్ని ప్రజలకు ఉచితంగా అందించిన ఘనత ఒక్క సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికే దక్కుతుందన్నారు. కార్యక్రమంలో మేయర్ వసీం, డిప్యూటీ మేయర్లు కోగటం విజయభాస్కర్ రెడ్డి, వాసంతి సాహిత్య, వక్ఫ్‌బోర్డు జిల్లా చైర్మన్ కాగజ్‌ఘర్ రిజ్వాన్, మార్కెట్‌యార్డు చైర్మన్ ఫయాజ్, పార్టీ బీసీ సెల్ జోనల్ ఇన్‌చార్జ్ రమేష్‌గౌడ్, కార్పొరేటర్లు రహంతుల్లా, టీవీ చంద్రమోహన్ రెడ్డి, కమల్‌భూషణ్, బాలాంజనేయులు, శ్రీనివాసులు అనుబంధ సంఘాల అధ్యక్షులు ఉమ్మడి మదన్‌మోహన్ రెడ్డి, కొర్రపాడు హుస్సేన్ పీరా, సైపుల్లాబేగ్, శ్రీదేవి, నగరాధ్యక్షుడు చింతా సోమశేఖర్ రెడ్డి, నగరాధ్యక్షురాలు కృష్ణవేణి, నాయకులు ఆలమూరు శ్రీనివాస్ రెడ్డి, రామయ్య, చింతకుంట మధు, రామచంద్ర, పీపీ రమణారెడ్డి, మధు, ఖాజా, వనారస బలారం, షకీల్, రాధా యాదవ్, అనిత, శోభాబాయి, ప్రసన్న, భారతి, సుహాసిని, సుజాతరెడ్డి, శోభాబాయి, తదితరులు పాల్గొన్నారు.

నేడు అదే డివిజన్‌లో:

ఇంటింటికీ వైఎస్సార్ సీపీ కార్యక్రమం బుధవారం కూడా 42వ డివిజన్‌లోనే ఉదయం 7.30 గంటలకు ప్రారంభమవుతుందని ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి పేర్కొన్నారు. డివిజన్‌లోని ఎంజీ టీవీఎస్ షోరూం (బళ్లారి రోడ్డు) నుంచి కార్యక్రమం మొదలవుతుందన్నారు. ప్రజాప్రతినిధులు, పార్టీ శ్రేణులు, కార్యకర్తలు, నాయకులు హాజరుకావాలని తెలిపారు.

క్లుప్తంగా

16న దేశవ్యాప్త బంద్



బంద్ పోస్టర్లు విడుదల చేస్తున్న సీఐటీయూ నాయకులు

అనంతపురం అర్బన్: వాహన చోదకులను అభద్రతకు గురిచేసే సేలా కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన హిట్ అండ్ రన్ చట్టాన్ని ఉపసంహరించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి నాగేంద్రకుమార్ అన్నారు. ఇదే డిమాండ్‌తో ఈనెల 16న చేపట్టిన దేశవ్యాప్త బంద్‌లో అన్ని వర్గాలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. మంగళవారం స్థానిక సంఘం కార్యాలయం వద్ద దేశవ్యాప్త బంద్ పోస్టర్లను నాయకులు విడుదల చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ 1వ నగర కార్యదర్శి వెంకటనారాయణ, భగత్ సింగ్ ఆటో డ్రైవర్ల సంఘం జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు, నాయకులు నాగరాజు పాల్గొన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్‌లోని సామగ్రి అపహరణ



ట్రాన్స్‌ఫార్మర్‌ను పగలకొట్టిన దృశ్యం

ఆత్మకూరు: మండలంలోని మదిగుబ్బ గ్రామం వద్ద పుల్లన్న అనే రైతు పొలం వద్ద ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌ను సోమవారం రాత్రి దుండగులు ధ్వంసం చేసి అందులోని సామగ్రిని ఎత్తుకెళ్లారు. మంగళవారం ఉదయం పొలానికి వెళ్లిన పుల్లన్న ట్రాన్స్‌ఫార్మర్‌ను ధ్వంసం చేసిన విషయాన్ని గుర్తించారు.

పౌష్టికాహారం సక్రమంగా అందించండి



అంగన్‌వాడీ కేంద్రంలో రికార్డులు పరిశీలిస్తున్న జిల్లా కమిటీ సభ్యుడు పెద్దన్న

ఆత్మకూరు: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందజేస్తున్న పౌష్టికాహారం లబ్ధిదారులకు సక్రమంగా అందించాలని అంగన్‌వాడీ విజిలెన్స్ జిల్లా కమిటీ సభ్యులు పెద్దన్న సూచించారు. మంగళవారం ఆత్మకూరు మండలంలోని ఆత్మకూరు, యాలేరు, పంపనూరు, వడ్డుపల్లి గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాలను ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పిల్లల హాజరు శాతం పూర్తిస్థాయిలో ఉండేలా చొరవ చూపాలన్నారు. సమయానికి అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు విధులకు హాజరుకావాలన్నారు.

విశ్వకర్మ పథకాన్ని సద్వినియోగం చేసుకోండి

అనంతపురం టౌన్: చేతివృత్తిదారుల నైపుణ్యాన్ని మరింతగా అభివృద్ధి చేసేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రధానమంత్రి విశ్వకర్మ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని జన శిక్షణ సంస్థాన్ డైరెక్టర్ సౌదాగర్ కోరారు. మంగళవారం విశ్వకర్మ పథకానికి దరఖాస్తు చేసుకున్న చేతివృత్తిదారులకు నెహ్రూ యువ కేంద్రలో శిక్షణ తరగతులను నిర్వహించారు. డైరెక్టర్ మాట్లాడుతూ శిక్షణలో చివరి రోజున నైపుణ్య అర్హత పరీక్ష నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రతిభ కనబరచిన అభ్యర్థులకు ఐడీ కార్డుతోపాటు పూర్తిస్థాయి శిక్షణ అందించనున్నట్లు తెలిపారు. శిక్షణ కాలంలో రోజుకు రూ.500 భృతితోపాటు రవాణా ఖర్చులకు అదనంగా రూ.1000 అందించనున్నట్లు చెప్పారు. మంగళవారం బార్బర్లకు నైపుణ్య శిక్షణ తరగతులు నిర్వహించారు. కార్యక్రమంలో పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ నాగరాజరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ మేలు మరువలేం



ఎమ్మెల్యే అనంతను సన్మానిస్తున్న రేషన్‌డీలర్లు

అనంతపురం కార్పొరేషన్: పదేళ్లకు పైగా పెండింగ్‌లో ఉన్న ఐసీడీఎస్, ఎండీఏ కమిషన్ బకాయిలను ప్రభుత్వం విడుదల చేయడంపై రేషన్ డీలర్ల ఆనందానికి అవధుల్లేకుండా పోయాయి. ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డిని మంగళవారం ఆయన నివాసంలో రేషన్ డీలర్లు మర్యాదపూర్వకంగా కలిసి, ఎమ్మెల్యేకి పుష్పగుచ్ఛం అందించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వంలో ప్రజా పంపిణీ వ్యవస్థలో విప్లవాత్మక మార్పులు తీసుకువచ్చినట్లు తెలిపారు. పదేళ్లుగా పెండింగ్‌లో ఉన్న రూ.23.71 కోట్లను ప్రభుత్వం విడుదల చేసిందన్నారు. రేషన్ డీలర్ల కమిషన్ పెంపు విషయంలోనూ ప్రభుత్వం సానుకూలంగా ఉందని, డీలర్ల సంక్షేమ నిధి కోసం ప్రత్యేకంగా కమిటీని కూడా కూడా వేసే ఆలోచనలో ఉందన్నారు. ప్రస్తుతం డోర్ డెలివరీ ద్వారా రేషన్ పంపిణీ జరుగుతోందని, డీలర్ల వ్యవస్థను కూడా కొనసాగిస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వ మేలు మరువలేమని రేషన్ డీలర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు బాలనాగిరెడ్డి, నగరాధ్యక్షుడు చెన్నారెడ్డి, డీలర్లు యోగానందరెడ్డి, రాజు, విశ్వనాథ రెడ్డి, ముంతాజ్, సల్మా తదితరులు పాల్గొన్నారు.

కంపచెట్ల తొలగింపు



కంపచెట్లను జేసీబీతో తొలగిస్తున్న దృశ్యం

రామగిరి: మండలంలోని కుంటిమద్ది జనార్ధన దీక్షితుల చెరువుకట్టపై ఏపుగా పెరిగిన కంపచెట్లను మంగళవారం సర్పంచ్ నరేంద్ర జేసీబీ వాహనంతో తొలగించేలా చర్యలు తీసుకున్నారు. ధర్మవరం–పేరూరుకు ప్రధాన రహదారి అయిన ఈ చెరువుకట్టపై ఎదురుగా వచ్చే వాహనాలు కనబడకుండా ముళ్ల కంప పెరిగింది. ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి ఆదేశాలతో కంపచెట్లను తొలగించారు.

కార్తికేయునికి పూజలు



ప్రత్యేక అలంకరణలో సుబ్రహ్మణ్యేశ్వరుడు

ఆత్మకూరు: మండలంలోని పంపనూరు గ్రామంలోని సర్పరూప సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో మాఘ మాసం మొదటి మంగళవారం సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి మొక్కులు చెల్లించుకున్నారు.

ఎస్‌బీఐ ద్వారా విరివిగా రుణాలు

- జనరల్ మేనేజర్ సంజయ్ కుమార్



ఎస్ఎంఈ క్లస్టర్ మీట్‌లో మాట్లాడుతున్న జీఎం సంజయ్‌కుమార్

అనంతపురం అగ్రికల్చర్: స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ) ద్వారా అన్ని రుణాలు, అన్ని వర్గాల అభ్యున్నతి కోసం విరివిగా సరళ పద్ధతిలో రుణాలు మంజూరు చేస్తామని ఎస్‌బీఐ అమరావతి సర్కిల్ జనరల్ మేనేజర్ సంజయ్‌కుమార్ తెలిపారు. మంగళవారం ఆర్ఎం ఎంవీ రమేష్ ఆధ్వర్యంలో జరిగిన వివిధ కార్యక్రమాల్లో జీఎం పాల్గొన్నారు. రామ్‌నగర్ నీరు–ప్రగతి పార్కు వద్ద గృహ రుణ మేళా, ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాలులో ఎస్ఎంఈ క్లస్టర్ మీట్, అనంతరం ఎస్‌బీఐ నుంచి సప్తగిరి సర్కిల్ వరకూ పాదయాత్ర నిర్వహించారు. జీఎం మాట్లాడుతూ గృహ నిర్మాణం, ఫ్లాట్స్ కొనుగోలు, మరమ్మతులు, వ్యాపారాలు, ముద్ర, వ్యక్తిగత రుణాలు, చిన్న, సూక్ష్మ స్థాయి పరిశ్రమలు, ఇన్‌స్టా, స్టార్టప్, టాప్‌అప్ రంగాలు, సామాజిక భద్రత, ఆరోగ్య బీమా తదితర అన్ని వర్గాలకు అనువైన, తక్కువ వడ్డీ రేట్లతో రుణాలు ఇస్తామన్నారు. కొన్నింటికి ఎలాంటి సెక్యూరిటీ లేకుండా రూ.50వేల నుంచి రూ.10 కోట్ల వరకూ రుణ సదుపాయం కల్పిస్తామని తెలిపారు.

నేడు సామూహిక అక్షరాభ్యాసం



నగరంలో కొలువు దీరిన శారదామాత

అనంతపురం కల్చరల్: జిల్లా అంతటా శ్రీపంచమి వేడుకలు జరగనున్నాయి. లక్ష్మీ, సరస్వతీ సముద్భవించిన రోజుగా వసంత పంచమి ప్రాముఖ్యాన్ని సంతరించుకుంది. అక్షరభ్యాసానికి తొలి అడుగులుగా శ్రీకారం చుట్టుకునే దినంగా ప్రసిద్ధి. అందువల్లే ప్రత్యేక దినాల్లో కన్నా శ్రీపంచమి నాడు అమ్మవారి ఆలయాల్లో అక్షరాభ్యాసాలు చేయిస్తారు. దీంతో నగరంలోని అనేక ఆలయాల్లో వసంతి పంచమి వేడుకలు నిర్వహించనున్నారు.

శారదామాత కొలువు దీరిన 'అనంత'..

చదువుల తల్లిగా భావించే సరస్వతీ మాత ప్రతిరూపమైన శారదా అమ్మవారు నగర శివారులోని శారదా శృంగేరీ శంకర మఠంలో కొలువుదీరి దశాబ్దాలుగా భక్తులను అనుగ్రహిస్తున్నారు. ఆహ్లాదకరమైన వాతావరణంలో నిర్మాణమైన శారదా మాత ఆలయం చదువుల తల్లిగా ప్రఖ్యాతిగాంచింది. స్థానిక మొదటిరోడ్డులోనికాశీవిశ్వేశ్వరాలయంలోని శారదామాత ఆలయంలోనూ అక్షరాభ్యాసం చేయిస్తారు. బుధవారం రెండు ఆలయాల్లోనూ పెద్ద ఎత్తున సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు వేర్వేరు ప్రకటనల్లో తెలిపారు.

ఆలయం నిర్మించడం ఇష్టం లేదా?

- టీడీపీ నాయకులపై యాదవ కులస్తుల ఆగ్రహం



మాట్లాడుతున్న యాదవ కులస్తులు, వైఎస్సార్‌సీపీ నాయకులు

ఆత్మకూరు: 'ప్రభుత్వ స్థలంలో శ్రీ కృష్ణుని దేవాలయం నిర్మిస్తే టీడీపీ నాయకులకు ఎందుకు అంత కడుపు మంట? శ్రీ కృష్ణ దేవాలయం నిర్మించడం టీడీపీ నాయకులకు ఇష్టం లేదా? ఆ స్థలం పక్కన, ముందు టీడీపీ నాయకుల పొలాలు ఉన్నాయి కదా మీకు అంత ప్రేమ ఉంటే మీ పొలాల్లో ఆలయ నిర్మాణాలకు భూమి ఇవ్వొచ్చుకదా..మాట్లాడే ముందు నిజాలు తెలుసుకొని టీడీపీ నాయకులు మాట్లాడాలి' అని ఆత్మకూరు మండలం వడ్డుపల్లికి చెందిన యాదవ కులస్తులు, వైఎస్సార్‌సీపీ నాయకులు టీడీపీ నాయకులపై మండిపడ్డారు. మంగళవారం వడ్డుపల్లిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. టీడీపీ మాజీ కన్వీనర్ కృష్ణమోహన్, మాజీ సర్పంచ్ నారాయణస్వామి మధ్య అంతర్గత కలహాలతో వడ్డుపల్లిలో ఉన్న వాటర్ ప్లాంట్ శిథిలావస్థకు చేరిందన్నారు. స్థానికంగా ఎక్కువ మంది యాదవ కులస్తులు ఉండటంతో సర్పంచ్‌తో పాటు అధికారులు, గ్రామస్తులు ఏకాభిప్రాయంతో శ్రీకృష్ణుడి ఆలయాన్ని నిర్మించాలని నిర్ణయించారన్నారు. శిథిలావస్థకు చేరిన ప్లాంట్ స్థానంలో నిర్మిస్తుంటే టీడీపీ నాయకులకు ఎందుకంత కడుపు మంట? అని ప్రశ్నించారు. వైఎస్సార్‌సీపీ నాయకులు మాట్లాడుతూ రూ.117 కోట్లతో గ్రామంలో పీఏబీఆర్ ద్వారా పైప్ లైన్ నిర్మాణం, ఎస్సీ కాలనీలో 40 వేల లీటర్ల ఓవర్‌హెడ్ ట్యాంకు నిర్మిస్తున్నారని తెలిపారు. దీంతో పాటు ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు జరిగాయన్నారు. ఇవేమి తెలీకుండా ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డిని విమర్శించడం సరికాదన్నారు. కార్యక్రమంలో యాదవ సంఘం నాయకులు మహేష్, నారాయణస్వామి, సర్పంచ్ లక్ష్మీనారాయణరెడ్డి, జేసీఎస్ మండల ఇన్‌చార్జ్ నరసింహారెడ్డి, వైఎస్సార్‌సీపీ యూత్ కన్వీనర్ గూలి కొండారెడ్డి, వైస్ ఎంపీపీ విజయ్ కుమార్ నాయక్, మాజీ సర్పంచ్ ఓబిరెడ్డి, ఉప సర్పంచ్ అశోక్, బాల శ్రీనివాసులు, మహేష్, కృష్ణారెడ్డి, పూల నారాయణరెడ్డి, కృష్ణారెడ్డి, సంజీవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కేవీ కన్‌స్ట్రక్షన్‌తో మోసపోయాం



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న బాధితులు

అనంతపురం టవర్‌క్లాక్: క్లాసిక్ హోమ్ పేరుతో కేవీ కన్‌స్ట్రక్షన్ నిర్వాహకుడు కాకుమాని వరుణ్ కుమార్ రూ.కోట్లు వసూలు చేసి మోసం చేశారని బాధితులు వాపోయారు. మంగళవారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. బాధితులు రంజిత్, రవీంద్రనాథ్ మాట్లాడుతూ కక్కలపల్లి గ్రామ పరిధిలో సర్వే నంబర్ 72–ఏ2, 72–1ఏ, 36–1బీలలో 1.11 ఎకరాల్లో కేవీ కన్‌స్ట్రక్షన్ పేరుతో కాకుమాని వరుణ్‌కుమార్ క్లాసిక్ హోమ్ పేరుతో డెవలపర్ కింద వెంచర్ వేశారన్నారు. అందులో 15 విల్లాలు నిర్మిస్తానని కొంతమందితో వ్యాపార ఒప్పందం కుదుర్చుకున్నారని, దీంతో పలువురు బ్యాంకు రుణాలు తీసుకొని జీపీ పొందిన వరుణ్‌కుమార్‌తో రిజిస్ట్రేషన్ చేయించుకున్నారన్నారు. అయితే ఈ భవంతులు నిర్మించడానికి భాగస్వామిగా వ్యవహరించాలని కోరడంతో తాము నమ్మి విడతల వారిగా రూ.90 లక్షల దాకా అందజేశామన్నారు. వచ్చిన లాభంలో 41 శాతం ఇస్తామని నమ్మబలికి అగ్రిమెంట్ కూడా రాసిచ్చారన్నారు. ఇప్పటికీ ఎలాంటి నిర్మాణాలు చేపట్టకుండా కాలయాపన చేస్తున్నారన్నారు. అప్పుగా తెచ్చిన డబ్బులకు వడ్డీలు కట్టలేక తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నామన్నారు. డబ్బులు ఇచ్చేది లేదని, ఏమి చేసుకుంటారో చేసుకోండంటూ వరుణ్ బెదిరింపులకు గురిచేస్తున్నాడన్నారు. పోలీసులను ఆశ్రయించినా తమకు న్యాయం జరగలేదని ఆవేదన వ్యక్తం చేశారు.

'దళితులను మోసగిస్తున్నది పరిటాల కుటుంబమే'

రామగిరి: గత 25 ఏళ్లుగా ఈ ప్రాంతంలో దళితులతో పాటు అన్ని బడుగు, బలహీన వర్గాలను తమ అవసరానికి వాడుకొని మోసగిస్తున్నది పరిటాల కుటుంబీకులేనని వైఎస్సార్‌సీపీ దళిత సంఘం నాయకులు విమర్శించారు. మంగళవారం రామగిరిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో తిప్పన్న, గంగన్న, శెట్టిముత్యాలు, శీన, బాబయ్య మాట్లాడారు. సోమవారం కొందరు టీడీపీ నాయకులు పుట్టపర్తిలో జరిగిన స్పందన కార్యక్రమంలో రామగిరిలో భూములను ఆక్రమించుకుంటున్నారంటూ చేసిన ఫిర్యాదుపై వారు స్పందించారు. ఎన్నో ఏళ్లుగా పరిటాల కుటుంబం మంత్రులు, ఎమ్మెల్యే పదవులను అనుభవిస్తూ 20 ఎకరాల నుంచి వందలాది ఎకరాలను దోచుకున్నారన్నారు. రామగిరి మండలంలోని రామగిరి, కుంటిమద్ది, పోలేపల్లి పంచాయతీల్లో త్వరలో జరిగే భూపంపిణీలో ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి 450 మంది నిరుపేదలకు ఒకటిన్నర ఎకరం చొప్పున భూ పంపిణీ చేయబోతున్నారని చెప్పారు. దాన్ని ఓర్వలేక స్పందన కార్యక్రమంలో తమ అనుచరులతో ఫిర్యాదు చేయించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. గత టీడీపీ ప్రభుత్వంలో అధికారులను బెదిరించి దళితుల భూములను లాక్కొని, పరిటాల అనుచరుల పేరున చేసుకుంది వాస్తవం కాదా? అని ప్రశ్నించారు. ఆ భూములు సోలార్ ప్లాంట్‌లకు పోగా వాటిపై ప్రభుత్వం అందించిన సొమ్మును దిగమింగారని విమర్శించారు. ఎన్నికల సమయంలో మాత్రమే గ్రామాల్లో పర్యటిస్తూ ప్రజలను రెచ్చగొట్టి ఆ తరువాత వదిలేయడం పరిటాల కుటుంబానికి కొత్తేమీకాదన్నారు. వచ్చే ఎన్నికల్లో రాప్తాడులో మరోసారి వైఎస్సార్‌సీపీ జెండా ఎగరడం ఖాయమన్నారు.

ఉద్యోగుల బకాయిలు తక్షణమే విడుదల చేయాలి

అనంతపురం టవర్‌క్లాక్: ఉద్యోగుల బకాయిలు తక్షణమే విడుదల చేయాలని ఏపీ జేఏసీ చైర్మన్ చంద్రశేఖర్‌రెడ్డి అన్నారు. మంగళవారం స్థానిక ఎన్జీవో కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ ఇప్పటి దాకా పెండింగ్‌లో ఉన్న ఉద్యోగుల బకాయిలను తక్షణమే విడుదల చేయాలని, లేని పక్షంలో జేఏసీగా ఏర్పడి ఉద్యమాలకు సిద్ధమవుతామన్నారు. ఈనెల 14న విధులకు నల్లబ్యాడ్జీలు ధరించి హాజరవుతామన్నారు. 15న నల్ల బ్యాడ్జీలతో పాటు మధ్యాహ్న భోజన సమయంలో నిరసనలు తెలుపుతామన్నారు. 16న కూడా అదే కార్యక్రమం కొనసాగుతుందన్నారు. 17న తాలూకా కేంద్రాలలో తహసీల్దార్లకు సమస్యలతో కూడిన వినతి పత్రం అందజేస్తామన్నారు. 20న కలెక్టరేట్ వద్ద నిరసన, 27న ఛలో విజయవాడ కార్యక్రమం చేపడతామన్నారు. కార్యక్రమంలో ఎస్టీవో రమణారెడ్డి, ప్రధాన కార్యదర్శి రామాంజనేయులు, ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు రవికుమార్, యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు గోవిందరాజులు, ఏపీటీఎఫ్–257 రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నరసింహయ్య, సిరాజుద్దీన్, సూరిబాబు, పెన్షనర్స్ సంఘం అధ్యక్షుడు పెద్దన్న గౌడ్, ప్రవీణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ సారథులకు సత్కారం

- ఆర్ఎం సుమంత్ ఆర్ ఆదోని

అనంతపురం క్రైం: ప్రయాణికుల భద్రతే లక్ష్యంగా పని చేస్తున్న ఆర్టీసీ పని చేస్తుందని ఆర్ఎం సుమంత్ ఆర్ ఆదోని తెలిపారు. ఈ దిశగా అంకిత భావంతో పని చేస్తున్న 24 మంది ఉత్తమ సారథులకు సత్కారం చేస్తున్నట్లు ఆర్ఎం తెలిపారు. మంగళవారం ఆయన తన చాంబర్‌లో మాట్లాడారు. రోడ్డు భద్రతా వారోత్సాలు ముగింపు సందర్భంగా జిల్లాలోని 7 డిపోల పరిధిలో పని చేస్తున్న 24 మంది డ్రైవర్లను ఉత్తమ డ్రైవర్లుగా ఎంపిక చేశామన్నారు. బుధవారం సాయంత్రం ఆర్టీసీ డిపో ఆవరణలో వీరిని సత్కరించనున్నట్లు తెలిపారు.

'నీటివాటాపై గొడవలు తగవు'

అనంతపురం టవర్‌క్లాక్: నీటి పంపకాలను ఆంధ్ర, తెలంగాణ రాష్ట్రాలు అన్నదమ్ముల్లాగా పంపకాలు చేసుకోవాలేగానీ గొడవలు చేసుకోరాదని మాజీ మంత్రి సాకే శైలజానాథ్ అన్నారు. మంగళవారం స్థానిక కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. శైలజానాథ్ మాట్లాడుతూ రాజకీయ పార్టీ నాయకులు రాయలసీమ కన్నీటి గాథలు చెప్పుకొని లబ్ధిపొందుతున్నారే కానీ న్యాయం చేయలేదన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ నుంచి విడిపోయినప్పుడు నీటి వాటాల పంపకాల్లో పొందుపరిచిన అంశాలను అమలు చేయాలన్నారు. తెలంగాణ అసెంబ్లీ సమావేశాలు, ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ సమావేశాల్లో నీటి పంపకాలపై చర్చలు జరుగుతున్నా, రాయలసీమకు ఒరిగిందేమీలేదన్నారు. ఆంధ్రప్రదేశ్‌కు రావాల్సిన వాటాను సక్రమంగా అమలు చేసే విధంగా చూడాలన్నారు. ఈనెల 16న నగరంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు బండ్లపల్లి ప్రతాప్‌రెడ్డి, వాసు తదితరులు పాల్గొన్నారు.

మాతా శిశు మరణాలు నివారించాలి



మాట్లాడుతున్న డీఎంహెచ్ఓ డాక్టర్ ఈ భ్రమరాంబ దేవి

అనంతపురం మెడికల్: మాతా శిశు మరణాల నివారణకు కృషి చేయాలని డీఎంహెచ్ఓ డాక్టర్ ఈ భ్రమరాంబ దేవి పేర్కొన్నారు. గత నెలలో జరిగిన 5 శిశు మరణాలపై సంబంధిత వైద్యాధికారులు, సిబ్బందితో డీఎంహెచ్ఓ కార్యాలయంలో డీఎంహెచ్ఓ సమావేశం ఏర్పాటు చేశారు. ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం గర్భిణులకు ఇమ్యునైజేషన్, ఆంటినేటల్ చెకప్స్, తదితర స్క్రీనింగ్ నిర్వహించాలన్నారు. ఆస్పత్రుల్లోనే ప్రసవం జరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతి పీహెచ్‌సీలో ప్రతి నెల 10 ప్రసవాలు జరగాలన్నారు. మదర్ అండ్ చైల్డ్ హెల్త్ నోడల్ అధికారి డాక్టర్ యుగంధర్ మాట్లాడుతూ హైరిస్క్ గర్భిణు పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. సమావేశంలో ఎంపీహెచ్ఈఓ లక్ష్మన్న, ఎంపీహెచ్ఎస్ హేమలత, తదితరులు పాల్గొన్నారు.

మజ్దూర్ యూనియన్ ఆత్మీయ సమ్మేళనం

అనంతపురం క్రైం: తపోవనంలోని సిటీగేట్ ఫంక్షన్ హాలులో నేషనల్ మజ్దూర్ యూనియన్ ఆత్మీయ సమ్మేళనం ఆ యూనియన్ నేతలు మంగళవారం నిర్వహించారు. విశ్రాంత అధికారులు విజయ్‌కుమార్, రామచంద్ర, ఓబుళరెడ్డి, యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు పీవీ రమణారెడ్డి పాల్గొన్నారు.

సేవాలాల్ జయంతిని నిర్వహించడం హర్షణీయం

అనంతపురం టవర్‌క్లాక్: సంత్ సేవాలాల్ జయంతి వేడుకలను ప్రభుత్వం అధికారికంగా జరుపుతుండడం హర్షణీయమని గిరిజన ప్రజా సమాఖ్య జాతీయ ఉపాధ్యక్షుడు మల్లికార్జున నాయక్ మంగళవారం తెలిపారు. ఏటా ఫిబ్రవరి 15న సేవాలాల్ మహరాజ్ జయంతి వేడుకలు నిర్వహిస్తున్నామన్నారు. ఈ ఏడాది ప్రభుత్వం అధికారికంగా నిర్వహించేందుకు జీవో విడుదల చేయడం సంతోషకరమన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి గిరిజనుల తరపున అభినందనలు తెలుపుతున్నామన్నారు.

గుండె వైద్య శిబిరానికి స్పందన

అనంతపురం మెడికల్: కిమ్స్ సవేరా, నగరానికి చెందిన తొండపునాటి రమేష్ ఆధ్వర్యంలో మంగళవారం మున్నానగర్‌లో జరిగిన ఉచిత గుండె వైద్య శిబిరానికి స్పందన వచ్చింది. కార్డియాలజిస్టు డాక్టర్ బాలకృష్ణ స్థానిక ప్రజలకు స్క్రీనింగ్ నిర్వహించారు. ఆరోగ్య శ్రీ ద్వారా ఉచితంగా గుండె శస్త్రచికిత్సలు చేయించేలా చర్యలు తీసుకుంటామని డాక్టర్ పేర్కొన్నారు.

అర్చకుల సమస్యలు పరిష్కరించండి

అనంతపురం కల్చరల్: అర్చకుల సమస్యలు పరిష్కరించాలని ఏపీ అర్చక సమాఖ్య జిల్లా అధ్యక్షుడు పూజారి భీమప్ప ప్రభుత్వాన్ని కోరారు. మంగళవారం స్థానిక మొదటిరోడ్డు కాశీవిశ్వేశ్వరాలయంలో జిల్లా అర్చక సమావేశం జరిగింది. సమాఖ్య రాష్ట్ర నాయకులు శ్రీనివాసులు, బసవరాజు, అర్చకం పులమాచార్యులు, శివశంకరశర్మ, తిమ్మరాజు, గోపాల్ హాజరై మాట్లాడారు. ఆలయంలో అనంత, సత్యసాయి జిల్లాల అర్చకులు పూజలు చేశారు.

రేపు రేడియో రైతు దినోత్సవం

అనంతపురం సిటీ: అనంతపురం కలెక్టరేట్‌లోని రెవెన్యూ భవన్‌లో గురువారం ఉదయం 10 గంటలకు రేడియో రైతు సదస్సు (రేడియో కిసాన్ దివస్–2024) నిర్వహించనున్నట్లు ఆకాశవాణి కేంద్రం ప్రోగ్రాం కోఆర్డినేటర్ జి.నాగేశ్వరరెడ్డి మంగళవారం తెలిపారు. కలెక్టర్ ఎం.గౌతమి అధ్యక్షతన జరిగే కార్యక్రమానికి ఉమ్మడి జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, ఎమ్మెల్యే అనంత వెంకట్రామిరెడ్డి, మేయర్ వసీం ముఖ్య అతిథులుగా హాజరుకానున్నట్లు వివరించారు. వివిధ సంస్థలు, శాఖల ఆధ్వర్యంలో స్టాల్స్ కూడా ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. ప్రోగ్రాం పర్యవేక్షకుడు సుధాకర్‌బాబు (డిప్యూటీ డైరెక్టర్–ఆకాశవాణి) ఆధ్వర్యంలో జరిగే కార్యక్రమానికి రైతులు, శాస్త్రవేత్తలు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

సంక్షిప్త సమాచారం

యువకుడి ఆత్మహత్య

యాడికి: కోనుప్పలపాడులో మద్యం మత్తులో రామచంద్రారెడ్డి అనే యువకుడు మంగళవారం రాత్రి ఆత్మహత్య చేసుకున్నాడు. వివరాలు.. గ్రామానికి చెందిన కోనా సోమశేఖర్‌రెడ్డికి ఇద్దరు కుమారులు. చిన్నకుమారుడు రామచంద్రారెడ్డి ఏడేళ్ల క్రితం కాకినాడకు చెందిన కుమారిని వివాహం చేసుకుని అక్కడే లారీ డ్రైవర్‌గా చేస్తున్నాడు. వీరికి ఏడేళ్ల కుమారుడు ఉన్నాడు. అప్పుడప్పుడు కోనుప్పలపాడుకు వచ్చి వ్యవసాయ పనులు చేసి తిరిగి కాకినాడకు వెళ్లేవాడు. పది రోజుల క్రితం కోనుప్పలపాడుకు వచ్చాడు. మంగళవారం సాయంత్రం క్రిమి సంహారక మందు తాగి, అపస్మారక స్థితిలో ఉండగా, తల్లిదండ్రులు గమనించి, ప్రభుత్వాస్పత్రికి తరలించారు. బంధువులు యాడికిలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా, అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు సీఐ నాగార్జున రెడ్డి తెలిపారు.

నేడు అభయాంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠ

కనగానపల్లి: మండలంలోని మామిళ్లపల్లిలో బుధవారం అభయాంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఆలయ ధర్మకర్త కె.లోకనాథరెడ్డి తెలిపారు. గ్రామంలోని ప్రధాన రహదారి పక్కన నూతనంగా నిర్మించిన ఆలయంలో ఆంజనేయస్వామి విగ్రహంతో పాటు నాగల ప్రతిష్ఠ కార్యక్రమాన్ని కూడా నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో స్థానికులతో పాటు చుట్టు పక్కల గ్రామాల నుంచి భక్తులు పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించాలన్నారు.